అనుదినం... జనస్వరం
ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక



8 పేజీలు | మంగళవారం 15 ఆగస్టు 2023 | www.navatelangana.com

అకుంఠిత దీక్ష..స్వాతంత్ర్య కాంక్ష..!

- విముక్తి కోసం ఏండ్లుగా సాగిన సమరం
- నిజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం
- అలుపెరుగని పోరులో అనేక మంది అమరులు
- స్వాతంత్రోద్యమంలో జిల్లా వాసులది ఎనలేని పాత్ర

"దేశమంతా స్వాతంత్ర్యం కోసం బ్రిటీషు మూకలతో పోరాడుతుంటే..తెలంగాణ రాష్ట్రంలో మాత్రం వారి ఆధీనంలోని నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సమరం సాగించారు. నియంతగా.. నిరంకుశంగా పాలన సాగిస్తున నిజాంను గద్దె దింపడమే లక్ష్యంగా సాగిన ఈ సమరంలో అనేక మంది వీరులు అసువులు బాశారు. కమ్యూనిస్టుల అండతో సామాన్య జనం చేసిన సాయుధ పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఈ సమరశీల పోరాటంలో ఉమ్మడి జిల్లా యోధుల పాత్ర ఎనలేనిది. అనేక నిర్బంధాలు, అరెస్టులను లెక్కచేయక నిజాం సర్కారును కూల్చడమే లక్ష్యంగా సాగిన ఈ పోరాటంలో శత్రుమూకల తూటాలకు బలైన అనేక మంది వీర మరణం పొందారు. వారి జ్ఞాపకాలు మాత్రం జిల్లా ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయాయి."


అప్పటి సాయుధ పోరాటానికి సాక్షిగా నిలిచిన అద్దాల మేడ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

స్వాతంత్ర్య సమరంలోనూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆదిలాబాద్‌జిల్లా వాసులు సాగించిన సమరశీల పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయి. నిజాం కబంద హస్తాల్లో మగ్గిపోతున్న తెలంగాణ ప్రాంతం స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడంలో అనాటి త్యాగధనుల పోరాటమే కారణం. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నిజాం సైన్యంకు ఎదురెడ్డి పోరాడిన ఫలితంగానే ఈ ప్రాంతం విముక్తి గావించింది. రజాకారుల నిర్బంధాన్ని తట్టుకుంటూనే రహస్యంగా తమ కార్యకలాపాలు కొనసాగించిన అమరవీరులు జిల్లా వాసులు. రజాకార్ల తూటాలకు కించిత్తు జంకకుండ పోరాడి అసువులు బాసిన వారెందరో ఉన్నారు. చివరికి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమరశీల పోరాటాలను విజయవంతంగా నడిపించిన త్యాగధనులను జిల్లా ప్రజానీకం ఎన్నటికీ మరిచిపోలేదు. అప్పటి పోలీసుల (రజాకార్ల) నిర్బంధానికి ఎదురొడ్డి నిలిచిన వారు కొందరైతే, రహస్యంగా జీవితం సాగిస్తూ పోరాటాలు సాగించిన వారు మరి కొందరు. వీరేగాక గిరిజనులు, కవులు, విద్యార్థులు, కమ్యూనిస్టులు, సింగరేణి కార్మికులు ఒక్కొక్కరుగా తమ పాత్రను నిర్వర్తించారు. నిజాం నిరంకుశత్వం ఆనవాల్లు కనుమరుగు అయ్యేదాకా తమ పంథా మార్చుకునేది లేదని ధైర్యంగా ముందుకు నడిచారు. నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించి స్వాతంత్ర కాంక్షను నెరవేర్చడంలో సఫలీకృతులయ్యారు.

కమ్యూనిస్టులది కీలకపాత్ర

నిజాం నిరంకుశ పాలనలో పెచ్చరిల్లుతోన్న దమనకాండకు వ్యతిరేకంగా జిల్లాలో కమ్యూనిస్టుల ఉద్యమం ఆవిర్భావానికి బీజం వేసింది. 1939 సంవత్సరంలో త్రిపుర కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్న గోవర్ధన్‌శాస్త్రి, రాంకిషన్‌శాస్త్రిలు కమ్యూనిస్టు ఆవిర్భావానికి శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్‌కు చెందిన దాజీ శంకర్ సైతం విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు వైపు ఉద్యమం ఆకర్షితులైనారు. 1944 సంవత్సరం నాటికి ఈ ఉద్యమం కాస్తా పల్లెపల్లెలకు వ్యాపించింది. జైనథ్ ప్రాంతానికి చెందిన నరకట్ల రాంకిష్టు, గౌరి నర్సింహులు, ఆదిలాబాద్ మండలం భీంసరి గ్రామానికి చెందిన పండరీనాథ్, ఆదిలాబాద్ నివాసులు జక్కుల నారాయణ, కస్తాల రాంకిష్టు, పోశెట్టి, యధువంశీ, దేవిదాస్, తాంసి నివాసి వేముల హన్మంతు, ఎల్లయ్య తదితరులు కమ్యూనిస్టు ఉద్యమంలో పాలు పంచుకున్నారు. శిస్తుల పేరుతో గ్రామీణ ప్రాంతాల ప్రజలపై నిజాం సైనికులు అరాచకం సృష్టిస్తోన్న తరుణంలో రైతులను సంఘటిత పరచడంలో కమ్యూనిస్టులు విజయం సాధించారు. ఇందులో భాగంగానే 1944లో వివిధ ప్రాంతాల్లో శిస్తుకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. ఆదిలాబాద్, నిర్మల్, బోథ్, ఖానాపూర్, తాలూకాల్లోని యువకులను చైతన్య పరిచి కమ్యూనిస్టు ఉద్యమాన్ని విస్తరించారు. నిజాం నిరంకుశ పాలనకు నిరసనగా కమ్యూనిస్టు ఉద్యమకారులు సాగించిన వీరోచిత పోరాటాలు జిల్లా చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయాయి.

అలుపెరుగని పోరాటం..!

నిజాం ప్రభుత్వం, బ్రిటీషు పాలకులు సాగిస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా ఉమ్మడి జిల్లా యోధులు అలుపెరగని పోరాటం సాగించారు.వివిధ రూపాల్లో ఉద్యమాన్ని నిర్వహిస్తూ నిజాం సర్కారును గడగడలాడించారు. సింగరేణి కార్మికులపై సాగించిన ఆకృత్యాలను ఎదురించడంలో శేషగిరిరావు కీలకపాత్ర పోషించారు. ఆయనతో పాటు రంగయ్య, పాపయ్యలు కార్మికుల హక్కుల కోసం వీరోచిత పోరాటం సాగించారు. స్వాతంత్ర్య పోరులో పాల్గొన్న కలం వీరుడు గోగుల సదాశివగుప్తా. జనాన్ని చైతన్యం చేసేలా గోల్కొండ పత్రికకు వార్తలు పంపించి నిజాం సర్కారుకు ఊపిరాడకుండా చేశారు. ఈ ప్రాంతంలో అక్షర చైతన్యం నింపిన నిర్మల్‌కు చెందిన ఠాకూర్(హన్మంతరావు) పోరాటం అనిర్వచనీయం. వీరితో పాటు మహారాష్ట్రలోని బల్లార్ష ప్రాంతంలో ఉంటూ పోరాటం సాగించారు లక్ష్మణచాందాకు చెందిన ఆకుల గోవిందం. ఆయనతో పాటు జె.కుమారస్వామి, ఈ.రాజయ్య పోరాటంలో పాల్గొని ఐదేండ్ల జైలు శిక్షను అనుభవించారు. అప్పటి కరీంనగర్

▸ మిగతా..4లో...

పశు వ్యాధుల నివారణే లక్ష్యం

నవతెలంగాణ-హాజీపూర్



జిల్లాలోని పశువులను వ్యాధుల నుంచి కాపాడేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు. స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణతో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 3 నియోజకవర్గాలు, 16 మండలాలలో జిల్లా ఆసుపత్రితో పాటు 2 ఏరియా వైద్యశాలలు ఉన్నాయి. 3 డివిజన్‌లలో 27 ప్రైమరీ వెటర్నరీ సెంటర్లు, 15 సబ్ సెంటర్లు కలుపుకొని మొత్తంగా 45 ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో 21 మంది పశు వైద్యులతో పాటు 95 మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారు. వీరు 27 మంది గోపాల మిత్ర సిబ్బంది గ్రామాలలో నిత్యం పశు సేవల్లో వుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా తెల్ల పశువులు 1.79 లక్షలు, గేదెలు ఒక లక్ష ఐదు వేలు, గొర్రెలు 5.2లక్షలు, మేకలు 31.83లక్షలు, కోళ్లు 25 పక్షులు, పందులు 2వేల పైచిలుకు వున్నాయి. మొత్తంగా 9.92లక్షల పశువులు వున్నాయి.

ఇటీవల గొర్రెలు, మేకలకు, ఇతర పశువులకు సామూహిక నట్టల నివారణ మందులు వేశాము. రైతుల దొడ్డి వద్దకే వెళ్లి మందులు వేశాం. నీలి నాలుక నివారణ కోసం మందులు సిద్ధంగా ఉంచాము. పశువులు చర్మ వ్యాధుల బారిన పడ్డాయి. లంపి స్కిన్ కోసం ఇప్పటికే అన్ని తెల్ల పశువులకు మొదటి దఫా టీకాలు వేశాము. గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా స్థాయి వరకు రైతులకు అనేక అవగాహన సదస్సును వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఎలాంటి చర్మ వ్యాధులు నమోదు కాలేదు. అత్యవసర పరిస్థితిలో 1962 నంబర్‌కు కాల్ చేస్తే సిబ్బంది రైతుల ఇంటికే నేరుగా వెళ్లి చికిత్స అందించడం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగులు పాడి పెంపకం ద్వారా పాలతో ఆర్థిక లాభాలు సాధించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పాల డెయిరీలు అందుబాటులో ఉన్నాయి. పాల వ్యాపారంతో అధిక దిగుబడి సాధించవచ్చు. కృత్రిమ గర్భత్పోత్తి ద్వారా సంకర జాతి దూడను పొంది మంచి పాడి పశువుల ద్వారా అధిక పాలు ఉత్పత్తిని సాధించవచ్చు. అధిక పాల దిగుబడి సాధించే ప్రత్యేక గ్రామాల కింద కొన్ని గ్రామాలను చేర్చి గిట్టుబాటు ధరను వచ్చేలా పాల వుత్పత్తిని చేయిస్తున్నాం. ప్రస్తుతం రోజుకు 45 వేల మంది రైతుల నుండి దాదాపు 1.10 లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతుంది.

5833 గొర్రెల యూనిట్లు పంపిణీ

తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా గొర్రెల పంపిణీ కార్యక్రమము చేపట్టడము జరిగుతుంది. మొదటి విడతలో జిల్లాలో 5833 గొర్రెల యూనిట్లు (1,22,493 గొర్రెలు) గొల్ల కుర్మలకు చెందినా లబ్దిదారులకు సరఫరా చేశాము. వాటికి ఈ 5 సంవత్సరాలలో 5,59,968 గొర్రె పిల్లలు పుట్టినవి. వాటిలో 50 శాతం గొర్రె పిల్లలు 2,79,984 మగవి కాగా వాటి అమ్మకం ద్వారా రూ.139.99 లక్షల ఆదాయం రావడం జరిగినది. మిగతా 50 శాతం ఆడ గొర్రె పిల్లలు 2,79,984 మంద పెంపునకు ఉపయోగపడ్డాయి. రెండవ విడతగా త్వరలో 5786 గొర్రెల యూనిట్లు ఇవ్వడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. యూనిట్ ధరను కూడా ప్రభుత్వము రూ.1.25 లక్షల నుంచి రూ.1.75 లక్షలకు పెంచడం జరిగినది. దీనితో 20 ఆడ గొర్రెలు,1 పొట్టేలు సరఫరా చేయడం జరుగుతుంది. రెండవ విడతలో 1,762 మంది గొల్ల కుర్మ యాదవులకు గొర్రెలు పంపిణి చేయడం జరిగినది. ఇంకా 4.138బి యూనిటు పంపిణీ చేయవలసి ఉంది.

ప్రకృతి ఒడిలో కొలువైన క్వారీ దుర్గమ్మ ఆలయం

- చెరువులతో ఆహ్లాద వాతావరణం
- సెలవు రోజుల్లో క్వారీలో పర్యాటకుల సందడి
- ప్రతి ఆషాడసమాసంలో ప్రత్యేక జాతర

అది దట్టమైన అడవి ప్రాంతం. చుట్టూ కొండలు కొండల నడుమ దారి. పక్షుల కిలకిల రావాలు. జంతువుల అరుపులు. కోతుల సందడుల. పక్కన రోప్‌వే నుండి తీగల ద్వారా బకెట్లలో సిమెంట్ రాయి వెళ్లడం క్వారీలోని నీటి కొలనులు అలాంటి సుందర ఆహ్లాద ప్రదేశంలో కొలువైంది దుర్గా మాతా. అమే భక్తుల పాలిట కొంగు బంగారం. ఇలా 52ఏళ్ల క్రితం వెలిసిన క్వారీ లోని దుర్గామాతా ఆలయం ప్రతీ ఆశాడమాసంలో ప్రత్యేక జాతరను నిర్వహిస్తారు. ఎంసీసీ యాజమాన్యం సెలవు రోజుల్లో జిల్లా నలుమూలల నుండి పర్యాటకుల వచ్చి సందడి చేస్తుంటారు.



నవతెలంగాణ-హాజీపూర్

మండలం ఘడ్పుర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకప్పుడు ఏసీసీ క్వారీగా పిలువబడిన ఎంసీసీ క్వారీలో దుర్గామాత కొలువైంది. ఎత్తైన ప్రదేశం చుట్టూ గుట్టలు ఎంసీసీ పార్కులు నీటి కొలనులు ఇలా సుందరమైన ప్రశాంత వాతావరణంలో ఉన్న దుర్గాదేవి ఆలయానికి నిత్యం భక్తుల తాకిడి ఉంటుంది. గుట్ట కింద ఉన్న మంచిర్యాల పట్టణం నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుండి చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి భక్తులు దుర్గాదేవి ఆలయానికి వస్తుంటారు. ఇక్కడ ఎంసీసీ యాజమాన్యం భక్తుల సౌకర్యాలను దష్టిలో పెట్టుకోని ఎప్పటికప్పుడు పారిశ్యుధ్య నీటి వసతి కల్పిస్తుంది. ముఖ్యంగా ఆదివారాల్లో అందరూ పిల్ల జల్లలతో క్వారీకి వెళ్లి అక్కడే వంట వార్పులు చేసుకోని రోజంతా ప్రశాంతంగా గడుపుతారు. అక్కడ సెల్ ఫోన్ సిగ్నల్స్





కూడా అందవు. దీంతో ప్రశాంతతను కోరుకునే వారు అక్కడ సెదతీరుతారు. పక్కనే ఎంసీసీ యాజమాన్యం సిమెంట్ రాయి కోసం తీసిన లోతైన గుంతల్లో క్వారీ ఏర్పడి సుమారు 2కిలోమీటర్ల పొడవు ఉండే క్వారీలో నీరు ఎల్లప్పుడూ అలలాడుతుండటం భక్తులను మరింత ఆహ్లాదానికి గురిచేస్తుంది. ఆ నీటి కొలనులు చుట్టూ కంపెనీ యాజమాన్యం పార్కులు నిర్మించింది. ఆ పార్కుల్లో సేద దీరుతూ లోకాన్ని మైమరిచిపోతుంటారు.

1971లో మొదలైన జాతర

52ఏళ్ల క్రితం నుండి ఇక్కడ జాతర నిర్వహింస్తున్నారు. 1971లో ఆషాడ మాసంలో మొదలైన జాతరకు మొదట్లో ఎంసీసీ కార్మికులు మాత్రమే జరుపుకునే వారు. ఎంసీసీ కంపెనీ యాజమాన్యం అక్కడ కొలువైన దుర్గామాతకు ఆలయాన్ని నిర్మించింది. తర్వాత గుట్ట పైన ఉన్న గిరిజన గ్రామాలైన ఘడ్పుర్, ర్యాలీ, నాగారం చిన్నగోపాల్ పూర్‌ల గిరిజనులు కూడా ఇక్కడ పూజలు చేయడం ఆనవాయితీగా మారింది. కాలక్రమేణా అన్ని వర్గాల వారు ఇక్కడికి రావడంతో విశేష ప్రాచుర్యం పొందింది. మంచిర్యాల సమీప గ్రామాలు కాకుండా పక్కనున్న పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, మహారాష్ట్రల నుండే కాకుండా ఉమ్మడి జిల్లా, పొరుగు జిల్లాల నుండి భక్తులు ఈ జాతరకు వేల సంఖ్యలో వస్తుంటారు. దీంతో రెండు రోజుల పాటు ఆ ప్రాంతం జాతరతో జనసందోహం అవుతుంది. భక్తులు వాహన పూజలు ఎక్కువ చేయిస్తారు. జాతర సమయంలో వందల సంఖ్యలో వాహనాలు పూజలకు వస్తుంటాయి. వాహనాలకు పూజలు చేసి మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులను పిలిచి దావత్‌లు ఏర్పాటు చేస్తారు.

పర్యాటక స్థలాల్లో ప్రథమ స్థానం

జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాల్లో ఎంసీసీ క్వారీ మొదట ఉంటుంది. దీనికి కారణం జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండడం ఒకటైతే ప్రకృతి అందాలు పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తాయి. పిచ్చుకల రాగాలు, కోతుల సందడులు, ఆహ్లాద పరిచే నీటి కొలనులు, వంకలు తిరిగిన ఘాట్ రోడ్డు ప్రయాణం అందుకె కావచ్చు ఇక్కడ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా సెలవు రోజుల్లో జిల్లా నలుమూలల నుండి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. బర్త్ డే పార్టీ లకు,ఉద్యోగ విరమణ పార్టీలకు, ఉద్యోగం సాధించిన తదితర పార్టీలకు నెలవు ఈ ఎంసీసీ క్వారీ. క్వారీ దాటి అవతలి గిరిజన గుడాలకు వెళ్తే అక్కడ గిరిజన ప్రజల జీవన శైలి ని ప్రత్యేకంగా చూడొచ్చు. గుట్ట పైన ర్యాలీ, ఘడ్పుర్, నాగారం, చిన్న గోపాల్పుర్ అనే నాలుగు గిరిజన గ్రామాలు ఉన్నాయి. వారు అడవుల్లో దొరికే వెదురు బొంగులతో బట్టలు అల్లడం, గిరిజన తరహా వ్యవసాయం చేయడం చూడొచ్చు. జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న కానీ గిరిజన గుడాలు మాత్రం అభివృద్ధికి ఆమడదూరంలో ఉండడం ఇంకా అక్కడ పురాతన గిరిజన సాంప్రదాయాలు మనకు కనబడుతుంటాయి.

సవాళ్లను ప్రతిఘటిస్తూ ముందుకు సాగుతాను

- మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజకీయంగా ఒక మనిషి ఎదగాలంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ సమీకరణాలు కలిసి రావాల్సి ఉంటుంది. కార్యకర్త స్థాయి నుంచి మండల అధ్యక్షుడిగా, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడిగా, ప్రత్యక్ష ఎన్నికల్లో ఎంపీటీసీగా గెలుపొంది, ప్రస్తుతం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గాధవేని మల్లేష్ ఎన్ని సవాళ్లు ఎదురైన ప్రతిఘటిస్తూ ముందుకు సాగుతానని చెబుతూనే స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో తన అనుభవాలను పంచుకున్నారు. తన ఎదుగుదలను ఓర్వలేని కొంతమంది రాజకీయంగా అనగదొక్కడానికి ప్రయత్నం చేశారన్నారు. రెండుసార్లు అక్రమంగా అట్రాసిటీ కేసు నమోదు చేసేలా చేశారని తెలిపారు. అయినప్పటికీ పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతలు నెరవేరుస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి ఎమ్మెల్యే ఆత్రం సక్కు తనకు ఎంతగానో సహకరించారని వారి సహకారంతో ఈ స్థాయికి వచ్చానని తనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. తాను ఎంపీటీసీగా గెలుపొందిన గుండి గ్రామానికి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిని ఎమ్మెల్యేతో కలిసి మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. రానున్న వేసవికాలంలో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తవుతాయని దీనితో గ్రామ ప్రజల దీర్ఘకాల కల నెరవేరుతుందన్నారు. గ్రామస్తులు తన మీద నమ్మకంతో అవకాశం ఇచ్చారని దానిని వారి కష్టాలు తీర్చడానికి ఉపయోగిస్తానని తెలిపారు. ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ ఆదాయం పెంచడానికి ప్రయత్నాలు



చేస్తున్నానని అన్నారు. రైతులకు వ్యాపారులకు ఇబ్బందులు కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఉన్నప్పుడు తాను మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోరుకుని అప్పటి చైర్మన్ తొలగింపు కుట్ర పన్నుతున్నానని అనేకమంది తనపై ఆరోపణలు చేశారని, రాష్ట్ర నాయకత్వం తనకు ఏ పదవి ఇచ్చిన పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన చైర్మన్ పదవిలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంటానని అన్నారు. ప్రజలకు మరోసారి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

16 నుండి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటన



నవతెలంగాణ-దహెగాం

బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఈ నెల 16వ తేదీన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ దహెగాం మండలంలో పర్యటించనున్నట్టు సిర్పూర్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు కొండా రాంప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిర్పూర్ నియోజకవర్గంలో అన్ని మండలాల కన్న విద్యా, వైద్యం, రవాణా, మౌళిక సదుపాయాలలో వెనుకబడిన మండలం దహెగాం మండలమని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఏ రాజకీయ నాయకులు ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని, స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాల పైచిలుకు అవుతున్నా మండల ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిన దాఖలాలు కనబడటం లేదని ఎద్దేవ చేశారు. ఉన్నత చదువులు చదివి ఎంతో మంది పేద విద్యార్థులను ప్రపంచ దేశాలలోని విశ్వవిద్యాలయాలలో ఉన్నతంగా చదివిస్తున్న గొప్ప చరిత్ర కలిగిన వ్యక్తి ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ అని కొనియాడారు. పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ఉన్నతమైన ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి పేద ప్రజల బాగు కోసం కష్టపడుతూ వారి స్థితిగతులను తెలుసుకుంటూ బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఈ నెల 16వ తేదీన ప్రారంభమయ్యే ఈ యాత్రలో మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల స్థానికత కష్టాలు

- 317 జీఓతో ఇతర జిల్లాలో స్థానికుడిగా గుర్తింపు
- రద్దు చేయాలంటూ ఉపాధ్యాయుల డిమాండ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాల పునర్విభజనతో ఉద్యోగ, ఉపాధ్యాలులు స్థానికత కోల్లోయి అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జిల్లాల పునర్విభజన డివిజన్ల పునర్విభజన జరగగా అధికారులకు పునర్విభజనకు మాత్రం మూడు సంవత్సరాల సమయం ఇచ్చారు. దీనితో 2021లో అధికారులు చివరి నిమిషంలో ఉద్యోగుల కేటాయింపుకు సంబంధించి 317 జీఓ తీసుకువచ్చి ఉపాధ్యాయ, ఉద్యోగుల కేటాయింపు చేశారు. అనేకమంది ఇతర జిల్లాలకు అయిష్టంగా వెళ్లి స్థానికత కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలో ఎంపిక సమయంలో ఖాళీ స్థానాల్లో భర్తీ తర్వాత బదిలీలో సొంత ప్రాంతంలోకి వెళ్దాం అనుకునే వారికి కూడా ఈ నిర్ణయం ఆశనిపాతంగా మారింది. స్వాతంత్ర దినోత్సవం సాక్షిగా స్వాతంత్ర్యం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కోసం జిల్లా కేంద్రాలతో పాటు హైదరాబాద్‌లో కూడా ఇప్పటికే ఆందోళన నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

317తో జిల్లాలో చోటు చేసుకున్న అంశాలు

317 జీఓతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉపాధ్యాయులు అనేకమంది ఆసిఫాబాద్ జిల్లాకు కేటాయించారు. సర్వీస్‌లో జూనియర్ కావడంతో ఇతర జిల్లాల నుండి జిల్లాకు వచ్చారు. వీరిలో మంచిర్యాల జిల్లా నుండి 123 మంది, నిర్మల్ జిల్లా నుండి 87 మంది, ఆదిలాబాద్ జిల్లా నుండి 153 మంది వచ్చారు. ఆయా జిల్లాల్లో వీరందరికీ సరిపడా పోస్టులు ఉన్నప్పటికీ అధికారులు బలవంతంగా ఇతర జిల్లాలకు పంపడంపై ఉపాధ్యాయులు ఆందోళనలు చేస్తున్నారు.

స్థానికతను కోల్పోయే ప్రమాదం

పుట్టినప్పటి నుండి ఒక ప్రాంతానికి అలవాటు పడ్డ ఉద్యోగ ఉపాధ్యాయులు 317 జీఓ ద్వారా స్థానికతను కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. ఇతర జిల్లాల నుంచి కేవలం విద్యాశాఖకు చెందిన వారే దాదాపు 300 మంది కుమరంభీం జిల్లాకు రావడం. వీరంతా యువకులు కావడంతో వారి సొంత జిల్లాలో స్థానికతను కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. ఇప్పుడు ఇదే వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంతో కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సాధించి స్వరాష్ట్రంలో స్థానికత కోల్పోయే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత జిల్లా విడిచిరావడం బాధ కల్గిస్తోంది

అనుదీపిక, ఎస్జ టి ఉపాధ్యాయురాలు.



2019లో ఎస్జీటీగా విధుల్లో చేరాను. 317 జీవో ద్వారా సొంత ఇంటికి దూరంగా వచ్చి విధులు నిర్వహించాల్సి వస్తోంది. నా భర్త ఆర్మీలో పని చేస్తాడు. ఇద్దరు పిల్లలతో 200 కిలోమీటర్లు దాటి వచ్చి విధులు నిర్వహించడం కష్టంగా మారింది. పెద్ద పాప అత్తమ్మ వాళ్ళ ఇంట్లో ఉంటూ ఫోన్ చేసినప్పుడు ఎప్పుడు వస్తావని అడగడం చాలా బాధేస్తుంది. సొంత రాష్ట్రంలో ఉద్యోగం సాధించానని సంతోషం కంటే ప్రభుత్వ విధానాలతో సొంత జిల్లా విడిచి రావడం జీర్ణించుకోలేకపోతున్నాను.

బదిలీల్లో కూడా అవకాశం లేదు

సూరం మౌనిక, ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు



నేను మంచిర్యాల జిల్లాకు చెంది ఉన్నప్పటికీ 2019లో నియామక సందర్భంలో అటువైపు ఖాళీలు దొరకక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కౌటాల మండలంలో పోస్టింగ్ తీసుకున్నాను. భవిష్యత్తులో బదిలీల్లో మంచిర్యాల వైపు అవకాశం వస్తుందని, సొంత ఊరు అన్నారం బ్యారేజ్ దగ్గర గల ముత్తరావుపెల్లిలో పనిచేయాలని ఆశించాను. చిన్ననాటి కలను 317 జీఓ నెరవేరకుండా చేసింది. ఉద్యోగం సాధించాననే సంతోషం కంటే జీవితంలో సొంత ఊరిలో పని చేయలేకపోతున్నానని బాధ ఎక్కువగా కలిచి వేస్తోంది. ప్రభుత్వం జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాను.

అనుబంధాలు దూరమవుతున్నాయి

శ్రీరామ్, ఎస్‌జీటీ నిర్మల్ జిల్లా వాసి



2017లో నిర్వహించిన టీఆర్టీ ద్వారా ఎస్‌జీటీగా ఎంపికయ్యాను. అప్పటికే లాంగ్వేజ్ పండిత్‌గా విధులు నిర్వహిస్తున్న అన్నయ్యతో కలిసి ఉద్యోగం నిర్వహించడం సంతోషాన్ని కలిగించింది. ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీఓ ద్వారా కుటుంబంతో ఉన్న అనుబంధం తెగిపోవడంతో పాటు, అన్నయ్య మంచిర్యాలకు, నేను ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ కావడంతో అమ్మానాన్నను చూసుకునేవారు లేకుండా పోయారు. ఇంత జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధ కలిగించింది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

- డీసీపీఓ బూర్ల మహేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశవ్యాప్తంగా బాలకార్మికులను నిర్మూలించడానికి ప్రభుత్వం రాజ్యాంగ రచనలో భాగంగా ప్రత్యేకంగా చట్టాలను రూపొందించింది. అలాగే చిన్న వయసులో పెళ్లిళ్లు నిర్మూలించడానికి బాల్య వివాహాల నుండి బాలికలను రక్షించడానికి కూడా ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. సమాజంలో చదువుకున్న వారు తక్కువగా ఉండడం ఇంకా ఆ వ్యవస్థ మీద నమ్మకాలు ఉండడంతో చాలామంది అటు వైపు మళ్లుతున్నారు. ఆడపిల్లలకు పెళ్లి చేస్తే తమ బాధ్యత తీరుతుందని తల్లిదండ్రుల భావన కూడా బాల్య వివాహాలకు తోడైంది. ఇది అభివృద్ధి చెందని కుమురంభీం జిల్లా లాంటి ప్రాంతంలో మరింత ఎక్కువగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటువంటి వాటిని పూర్తిగా నివారించడానికి ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే విధంగా జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పేరుతో ప్రత్యేక అధికారి నియమించింది. అభివృద్ధి చెందిన ఇతర జిల్లాల్లో ఈ అధికారిగా పని చేయడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ భీం జిల్లాలో డీసీపీఓగా పనిచేస్తూ బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నడుం కట్టిన బూర్ల మహేశ్ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు.

తల్లి దండ్రులు సహకరించాలి

బాల్య వివాహాల నిర్మూలన కోసం ఎప్పటికప్పుడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తల్లి దండ్రుల సహకారం తప్పక ఉండాలి. జిల్లాలో ఇప్పటివరకు 32 బాల్యవివాహాలను నిలుపుదల చేశాం. బాల్య వివాహాల వల్ల పుట్టే పిల్లలు ఎదుగుదల ఉండదు. తమ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే వెంటనే మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులము అయిన తమకు సమాచారం అందించాలి. తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని ఆలోచించి బాల్యవివాహాలు చేయకూడదు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం కింద ఇప్పటి వరకు జిల్లాలో 73 మంది బాల కార్మికులను రెస్క్యూ చేశాము. 18 సంవత్సరాలు నిండని వారిని ఎట్టి పరిస్థితుల్లో పని ప్రదేశాల్లో నియమించు కోకూడదు. అలా చేసినట్లయితే చట్టప్రకారం శిక్షార్హులు అవుతారు.

నెల రోజులు ప్రత్యేక డ్రైవ్

జులై 1 నుండి జులై 31 వరకు దీనిని ప్రత్యేక కార్యక్రమంగా తీసుకున్నాము. దీనిలో భాగంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో 152 అవగాహన సదస్సులు నిర్వహించాము. జిల్లాలోని ప్రతి గ్రామంలో రానున్న రోజుల్లో గ్రామస్తులకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి నిర్ణయించుకున్నాము. గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. దీనితోపాటు గ్రామ స్థాయిలో సర్పంచి అధ్యక్షునిగా గ్రామ కమిటీ వేస్తున్నాము. దీనిలో గ్రామంలోని పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడీ ఇతర అధికారులతో పాటు గ్రామస్థులు కూడా సభ్యులుగా ఉంటారు.

25 మంది అనాధ పిల్లలను గుర్తించాం

అనాధ పిల్లల కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్పాన్సర్ షిప్ కార్యక్రమం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. దీనిలో భాగంగా ఇప్పటికే 25 మంది అనాధ పిల్లలను గుర్తించాము. వీరికి ప్రతి నెల రూ.రెండు వేల చొప్పున ప్రభుత్వం నుండి స్పాన్సర్ షిప్ చెల్లిస్తున్నాము. దీనితో వారికి ఆర్థికంగా కొంత చేయూత కలిగే అవకాశం ఉంటుంది. ఇదే కాకుండా కోవిడ్‌తో అనాధలైన 7 మంది బాలలను గుర్తించి 23 సంవత్సరాలు వచ్చేవరకు వారికి ప్రతినెల రూ.4000 స్కాలర్షిప్ చెల్లిస్తున్నాము. దీనితోపాటు పిఎంకేర్ ద్వారా రూ.10 లక్షలు వారి పేరిట డిపాజిట్ చేయడం జరిగింది. 23 సంవత్సరాల తర్వాత ఆ మొత్తాన్ని వారు వినియోగించుకోవచ్చు. కోవిడ్ అనాధలను రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్చడంతో పాటు ప్రతి సంవత్సరం వారి పుస్తకాల కోసం రూ.20,000 అందిస్తున్నాము.

రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హన్మకొండలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించే డీవైఎఫ్ఐ రాష్ట్ర శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ కోరారు. జిల్లా కేంద్రంలో నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నాటి పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ 1980లో డీవైఎఫ్ఐ పంజాబ్లోని లూథియానాలో ఏర్పడిందన్నారు. అప్పటి నుండి అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిందని గుర్తు చేశారు. నిరుద్యోగుల పాలిట పోరాటాలు చేయడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొన్న ఉదాహరణలు తెలిపారు. అటువంటి గొప్ప చరిత్ర కలిగిన యువజన సంఘ శిక్షణ తరగతులకు 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరి సతీష్, చాపిడి పురుషోత్తం, దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తులపై ఇంటింటి సర్వే



నవతెలంగాణ-కౌటాల

గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం మండలంలోని ముత్తంపేట గ్రామంలో ఎంపీఓ మౌనిక, కార్యదర్శి సాయికృష్ణ దరఖాస్తులతో పాటు ఇంటింటికి తిరిగి లబ్ధిదారులను గుర్తించినట్టు ఎంపీఓ తెలిపారు. లబ్దిదారుల గుర్తింపు పారదర్శకంగా నిర్వహిస్తామని, అర్హులైన వారికే వచ్చేలా చూస్తామని తెలిపారు.

మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని వెంచపల్లి ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో కోటపల్లి ఎస్సై సురేష్, నీల్వాయి ఎస్సై సుబ్బారావు సోమవారం పర్యటించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు సరిహద్దుల్లో తనిఖీ నిర్వహించామని అన్నారు. ప్రజలు ఎవరు సంఘవిద్రోహశక్తులకు సహకరించవద్దని, ఎవరు ఆశ్రమం కల్పించకూడదని సూచించారు. అలాగే నది సరిహద్దుల్లో బోట్ ఆపరేటర్స్‌తో మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించిన, కొత్త వ్యక్తులు కనిపించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

శివాలయంలో బెంగాళీల పూజలు

కౌటాల : మండలకేంద్రంలోని సదాశివ్‌పేట్ శివాలయంలో సోమవారం రవీంద్రనగర్ బెంగాళీ మహిళలు ఏడు కిలోమీటర్లుగా పాదయాత్ర చేసి ఆలయ పూజారి అంబేద శంకరయ్య, సంతోష్‌తో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని శివుని ఆలయంలో అభిషేకం చేయడం జరిగిందని మహిళలు పేర్కొన్నారు.

కల్పతరువు..పట్టింపు కరువు..!

- సీసీఐ పునరుద్ధరణపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి
- ముడి సరుకు పుష్కలం..రవాణాకు అనుకూలం
- మూతపడటంతో కార్మికులకు ఉపాధి దూరం
- ఆనవాళ్లు కోల్పోతున్న సిమెంట్ పరిశ్రమ

కార్మికులకు ఉపాధి..యువతకు ఉద్యోగాల కల్పతరువుగా ఉన్న సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణపై నిర్లక్ష్యం కమ్ముకుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి అతి సమీపంలో సుమారు 2వేలకు పైగా ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం అలవిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ కనుమరగయ్యే ప్రమాదం కనిపిస్తోంది. పారిశ్రామిక రంగం అభివృద్ధికి పాటుపడాల్సిన ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం మూలంగా జిల్లావాసులకు నిరాశే మిగులుతోంది. బీజేపీ మినహా మిగితా అన్ని రాజకీయ పార్టీలు సీసీఐ సాధన సమితిగా ఏర్పడి ఉద్యమించినా కేంద్రం పట్టించుకోవడం లేదు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. మరోపక్క ఈ పరిశ్రమలోని సామగ్రిని తుక్కు కింద వేలం వేయాలని ఆదేశాలు జారీ చేయడం జిల్లావాసులను మరింత కలవరపాటుకు గురిచేసింది. కేంద్రప్రభుత్వం ఈ పరిశ్రమను రాష్ట్రానికి అప్పగించినా నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినా కేంద్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అన్యాక్రాంతమవుతోంది. ఒకప్పుడు వేలాది మంది కార్మికుల జీవితాల్లో దశాబ్ద కాలం పాటు వెలుగులు నింపిన ఈ పరిశ్రమ తాజాగా చీకట్లో మగ్గిపోతోంది. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో సుమారు 2289.85 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పరిశ్రమ మూతపడి గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. 1979లో ఈ పరిశ్రమ పనులు ప్రారంభం కాగా ఏడాదికి 4లక్షల టన్నుల సామర్థ్యంతో 1984 ఏప్రిల్‌లో ఉత్పత్తి ప్రారంభమైంది. 14ఏండ్ల పాటు నిర్విరామంగా నడిచిన ఈ పరిశ్రమ 1998లో మూతపడింది. ఈ పరిశ్రమ కోసం అంచనా వేసిన 48.18 మిలియన్ టన్నుల ముడిసరుకులో కేవలం ఆరు టన్నులు మాత్రమే వినియోగించింది. మిగితా 42.66మిలియన్ టన్నుల ముడి సరుకు అందుబాటులో ఉంది. సుమారు వందేండ్లకు సరిపడా ముడి సరుకు నిల్వలున్నాయి. పరిశ్రమ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాల పరిధిలో లైమ్‌స్టోన్ నిల్వలు ఉన్నట్లు నిపుణులు అంచనా వేశారు. సిమెంట్ ఉత్పత్తికి అవసరమైన నిల్వలు పుష్కలంగా ఉండటంతో పరిశ్రమ కొనసాగేందుకు అన్ని అనుకూలతలు ఉన్నాయి.

రవాణాకు అనుకూలం..!

ఈ పరిశ్రమలో ఉత్పత్తి అయిన సిమెంటును ఇతర ప్రాంతాలకు తరలించేందుకు రవాణా పరంగా అన్ని సౌకర్యాలున్నాయి. కేవలం కిలో మీటరు దూరంలో రైల్వేట్రాక్ ఉండటంతో పాటు మూడు కిలో మీటర్ల దూరంలో 44వ జాతీయ రహదారి సౌకర్యం ఉంది. ఇది వరకు ఇక్కడి సిమెంటును తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు సరఫరా చేసేవారు. ఈ పరిశ్రమ నడిచే రోజుల్లో 700మంది రెగ్యూలర్ ఉద్యోగులతో పాటు మరో 2వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేసేవారు. వీరితో పాటు మరో 1500మంది వరకు పరోక్షంగా ఉపాధి లభించేదని అప్పటి కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు. ఈ పరిశ్రమ కొనసాగే రోజుల్లో వాణిజ్య పరంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రం కొనుగోళ్లతో సందడిగా ఉండేది. వివిధ రకాల వ్యాపారాలు జోరుగా సాగేవి. అనేక మంది ఈ పరిశ్రమ ద్వారా ప్రయోజనం పొందారు.

స్పందించని కేంద్ర ప్రభుత్వం..!

ఈ పరిశ్రమను పునరుద్ధరిస్తామని గతంలో ఎన్నికల సమయంలో బీజేపీ నాయకులు హామీనిచ్చారు. ఎంపీగా గెలిపిస్తే తెరిపిస్తామని హామీనిచ్చి..తీరా విజయం సాధించిన తర్వాత సదరు నాయకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిశ్రమ పునరుద్ధరించాలని బీజేపీ మినహా జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా సీసీఐ సాధన సమితిగా ఏర్పడి ఉద్యమించాయి. జాతీయ రహదారి దిగ్బంధనం, పట్టణ బంద్ తదితర కార్యక్రమాలు చేపట్టాయి. కేంద్రం దృష్టికి సమస్యను తీసుకెళ్లినా కేంద్రప్రభుత్వం మాత్రం పెడచెవిన పెట్టిందనే విమర్శలున్నాయి. ఈ పరిశ్రమను తెరిపించకపోగా.. సామగ్రిని తుక్కు కింద వేలం వేస్తూ నిర్ణయం తీసుకోవడం జిల్లావాసులను మరింత నిరాశకు గురిచేసింది.



సీసీఐని సందర్శించిన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు(ఫైల్)

ఈటలను కలిసిన పత్తి శ్రీనివాస్

రామకృష్ణాపూర్ : బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పత్తి శ్రీనివాస్ సోమవారం చెన్నూర్ నియోజకవర్గ బిజెపి నాయకులతో కలిసి రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పత్తి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు విషయాలు వారితో చర్చించారు. కార్యక్రమంలో క్యాతనపల్లి పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శులు మాస్ సత్యనారాయణ, వేల్పుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వైద్య శ్రీనివాస్, జంగపెల్లి మల్లయ్య, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కున్‌సొత్ సంతోష్‌రామ్, పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులు వీరమల్ల పాలరాజయ్య, జిల్లా నాయకులు ఎరుకల నరసింహరాజు, కల్లెపెల్లి నవీన్, రామ్ కిషోర్, పట్టణ మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు బెజ్జంకి కవిత, వైద్య ధనలక్ష్మి, నాయకులు చిలుక స్వామి, ఊర్సు నర్సయ్య, తరుణ్ పాల్గొన్నారు.

అకుంఠిత దీక్ష.. స్వాతంత్ర్య కాంక్ష..!

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా ధర్మపురికి చెందిన కే.వి.కేశవులు ఆదిలాబాద్ కేంద్రంగా ఉద్యమాన్ని కొనసాగించారు. తన మాటలతో కవితల రూపంలో నిజాం సర్కారును ఎదురించిన మరో కలం వీరుడు వానమామలై వరదాచార్యుల పోరాటం అనిర్వచీనయమైనది. వీరితో పాటు వాంకిడి ప్రాంతానికి చెందిన కొండా లక్ష్మణ్‌బాపూజీ హైదరాబాదు కోఠిలోని బ్రిటీషు రెసిడెన్సిపై జాతీయ జెండా ఎగురవేసి చరిత్ర సృష్టించారు. ఆసిఫాబాద్ ప్రాంతానికి చెందిన నాగేంద్రయ్య, కాంద్రె శంకర్, చీల శంకర్, రాంసింగ్, జగన్నాథ్, దేవయ్య, బోనగిరి వెంకటేశం, టి.తిరుపతి, రాంచందర్‌రావు పైకాజీ, రాంకిషన్‌రావు వంటి అనేక మంది మహానుభావులు స్వాతంత్ర్య సమరంలో పాలు పంచుకున్నారు. వీరిలో అనేక మంది ఉద్యమ సమయంలో అమరులు కాగా.. మరికొంత మంది స్వాతంత్ర్య ఫలాలను కండ్లరా చూశారు. ఇంకొంత మంది కొద్ది కాలం క్రితం వరకు మరణించిన వారు ఉన్నారు. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు అనేక మంది నిజాం నిరంకుశకత్వానికి..బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం నిర్వహించి జిల్లా ప్రజలను బానిస బతుకుల నుంచి విముక్తి గావించారు. ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోయారు.



సెప్టెంబర్ 3న 11వ వేజ్ బోర్డ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

11వ వేజ్‌బోర్డు 23 నెలల ఎరియర్స్ ఆగస్ట్ నెల వేతనాలతో సెప్టెంబర్ 3న చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండి అక్బర్ అలీ డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా జరిగే ధర్నాల్లో భాగంగా పట్టణంలోని పలు గనులపై, డిపార్ట్మెంట్‌లపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేసి ఆయా గనుల మేనేజర్‌లకు మెమోరాండం అందజేశారు. అనంతరం అక్బర్ అలీ మాట్లాడుతూ కోల్ ఇండియాలో ఒప్పందం జరిగి సర్క్యులర్ వచ్చినా సింగరేణి యాజమాన్యంలో ఉలుకు పలుకు లేదని ధ్వజమెత్తారు. ఏఐటీయూసీ, జాతీయ సంఘాలను విమర్శించే గుర్తింపు సంఘం వేజ్ బోర్డు ఒప్పందం జరిగి సర్క్యులర్ వచ్చినా నోరు మెదపడం లేదని ఎద్దేవా చేశారు. గతంలో ఏఐటీయూసీ జాతీయ సంఘాలను కోల్ ఇండియాలో మాట్లాడకుండా సింగరేణిలో అడుగుతున్నారని ప్రచారం చేశారు. ఇప్పటికైనా కార్మికుల అనుమానాన్ని తొలగించే విధంగా వెంటనే ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కె ఓసిపి పిట్ కార్యదర్శి ఎ.ఆంజనేయులు, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జి వి.రాజేశ్వరరావు, ఆర్కె1ఏ పిట్ కార్యదర్శి సురమళ్ల వినయ్, ఆర్కెసిహెచ్‌పి ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్, జీవీ.రామకృష్ణ, యస్.సంపత్, ఆవుల మల్లమ్మ, యం.సంపత్, శ్రీధర్, గాజుల రాయమల్లు, సుంకరి గట్టయ్య, గోత్తగిరి ప్రసాద్, బాల్‌రెడ్డి, చంద్రకాని రమేశ్, వెంకటేశ్వర్‌రెడ్డి, నజీర్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు రెండో ఏఎన్ఎంల సమ్మె నోటీస్



ఆసిఫాబాద్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్స్ స్కీంలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎం అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రెండవ ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్ని సంవత్సరాలు ఏఎన్ఎంల సేవలు ఉపయోగించుకొని కనీసం వారి గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ నెల 16 నుండి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెండవ ఏఎన్ఎంలు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, జిల్లా కార్యదర్శి మధుకర్, యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.సంతోషి, కోశాధికారి సునీత, పరమేశ్వరి, పుష్ప, సత్యమ్మ, పద్మ, మమత, లీల పాల్గొన్నారు.

పశుమిత్రుల సేవలు ప్రభుత్వం గుర్తించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూగజీవాలకు పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో సేవలందిస్తున్న పశు మిత్రలను ప్రభుత్వం గుర్తించాలని, వారికి వేతనాలు నిర్ణయించి అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు మిత్రులకు నిర్ణీత వేతనాలు, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ వెంటనే ఇవ్వాలన్నారు. మూగజీవులకు వైద్య సేవలు, వ్యాధుల నివారణ టీకాలు వేస్తూ, పశువుల ఆరోగ్యాలను కాపాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు నిర్ణయించి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వేతనాలు నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశు మిత్రలకు బీమా, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుమిత్రల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇందు, శ్రీలత, పశుమిత్రలు వసుంధర, మారుబాయి, కవిత, కళ్యాణి, మీనా, ఇందు, భారతి పాల్గొన్నారు.

గమ్యం చేరేందుకు...

(14, ఆగస్టు 1947 అర్థరాత్రి అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఉపన్యాసం)

చాలా సంవత్సరాల క్రితం గమ్యం చేరడానకి ఒక ప్రయత్నం జరిగింది. ఇప్పుడు ఆ ప్రతిజ్ఞను గణనీయంగా పూర్తిచేసే సమయం వచ్చింది. అర్ధరాత్రి సమయంలో, ప్రపంచం నిద్రపోతున్నప్పుడు, భారతదేశం కొత్త జీవితంలోకి, స్వేచ్ఛలోకి మేల్కొంటోంది. ఈ రోజు మనం కష్టాల కాలాన్ని ముగించాం, దీంతో భారతదేశం మళ్లీ తనను తాను కనుగొంటుంది. ఈ రోజు మన దేశం జరుపుకునే విజయం ఒక అడుగు మాత్రమే, ఎదురుచూసే గొప్ప విజయాల గమ్యంలో ఇది మనకు ఒక అవకాశం. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, భవిష్యత్తు సవాళ్ళను స్వీకరించడానికి మనం తగినంత ధైర్యంగా, అవగాహనతో ఉన్నామా?

స్వేచ్ఛ, అధికారంతో బాధ్యత కూడా వస్తుంది. భారతదేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే సార్వభౌమాధికార సంస్థ అయిన ఈ అసెంబ్లీపై ఆ బాధ్యత ఉంది. స్వాతంత్ర్యం రాకముందే ప్రసవ వేదనలన్నింటినీ భరించాం, ఆ దుఃఖాన్ని తలచుకుంటే గుండె బరువెక్కుతుంది. ఆ కష్టాల్లో కొన్ని ఇప్పుడు కూడా కొనసాగుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ గతం ముగిసింది. భవిష్యత్తు మనముందు సిద్ధంగా ఉంది. ఆ భవిష్యత్తు సౌలభ్యం లేదా విశ్రాంతికి సంబంధించినది కాదు, ఎడతెగని కృషితో కూడినది. అలా చేయగలిగినప్పుడు మాత్రమే మనం తరచుగా తీసుకున్న ప్రతిజ్ఞలను, తీసుకోబోయే ప్రతిజ్ఞలను నెరవేర్చగలం. భారత దేశానికి సేవ అంటే, కష్టాలు అనుభవిస్తున్న లక్షలాది మంది ప్రజల సేవ. దీని అర్థం పేదరికం, అజ్ఞానాన్ని రూపుమాపటం. వ్యాధులను, అసమానతలను అంతం చేయడం.

మన తరంలోని గొప్ప వ్యక్తుల ఆశయం భారత ప్రజల కన్నీటిని తుడవడం. ఆ లక్ష్యం మనకు పెద్దదే కావచ్చు, కానీ కన్నీళ్లు, బాధలు ఉన్నంత కాలం మన పని ఆగదు. మన కలలకు వాస్తవికతను అందించడానికి మనం శ్రమించాలి. ఆ కలలు భారతదేశం కోసం మాత్రమే కాదు, ప్రపంచం కోసం కూడా. ఎందుకంటే అన్ని దేశాలు, ప్రజలు ఈ రోజు చాలా దగ్గరగా ముడిపడి ఉన్నారు. వారిలో ఎవరూ విడిగా జీవించలేరు. శాంతి, స్వేచ్ఛ, శ్రేయస్సు ఇవన్నీ విభజించలేనివి. ప్రపంచం శకలాలుగా విభజించబడితే అది ముప్పే అని భావించాలి.



భారతదేశ ప్రజల ప్రతినిధులుగా ఉన్న మాతో, ఈ గొప్ప ప్రయత్నంలో విశ్వాసంతో చేతులు కలపాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఎట్టకేలకు నిర్ణీత రోజు రానే వచ్చింది. సుదీర్ఘ నిద్ర, పోరాటం తర్వాత, భారతదేశం మేల్కొని, కీలకమైనదిగా, స్వేచ్ఛగా, స్వతంత్రంగా మళ్లీ నిలబడిన రోజు. గతం తాలూకు జ్ఞాపకాలు ఇప్పటికీ ఏదో ఒక కొలమానంలో మనకు అంటిపెట్టుకుని ఉంటాయి. అయితే మన ప్రతిజ్ఞలను నెరవేర్చడానికి ముందు మనం చాలా చేయాల్సి ఉంటుంది.

ఈ క్షణం భారతదేశంలోని మనకు, మొత్తం ఆసియాకు, ప్రపంచానికి మధుర క్షణం. ఒక కొత్త నక్షత్రం ఉదయించింది. తూర్పున స్వేచ్ఛ, ఒక కొత్త ఆశ ఉనికిలోకి వచ్చింది. దీర్ఘకాలంగా కోరుకుంటున్న స్వేచ్ఛ సాకారమవుతున్న క్షణం. ఈ నక్షత్రం ఎప్పటికీ అస్తమించరాదు, ఆ ఆశలు ఎప్పుడూ వమ్ము కాకూడదు! మేఘాలు మమ్మల్ని చుట్టుముట్టినప్పటికీ, మనలో చాలా మంది ప్రజలు దుఃఖంతో, కష్టమైన సమస్యలు చుట్టుముట్టి బాధలు పడుతున్నప్పటికీ, ఈ స్వాతంత్ర్యానికి మేము సంతోషిస్తున్నాం. కానీ స్వేచ్ఛ బాధ్యతలనూ భారాలనూ తెస్తుంది కాబట్టి... మనం వాటిని స్వతంత్రతా భావమున్న, క్రమశిక్షణ గల వ్యక్తుల స్ఫూర్తితో నిర్వర్తించాలి.

ఈ రోజున మన మొదటి ఆలోచనలు ఈ స్వేచ్ఛ యొక్క రూపశిల్పి, మన జాతిపిత వైపు వెళ్తాయి. భారతదేశ గత స్ఫూర్తిని మూర్తీభవిస్తూ, స్వాతంత్ర్య జ్యోతిని పట్టుకుని, మన చుట్టూ ఉన్న చీకటిని వారు పారద్రోలి, వెలుగుని ప్రసరించారు. మనమే కాదు భవిష్యత్ తరాలు కూడా వారి సందేశాన్ని గుర్తుంచుకుంటాయి. ఈ దేశపు గొప్ప పుత్రుని అద్భుతమైన విశ్వాసం, బలం, ధైర్యం, వినయాన్ని తమ హృదయాలలో ముద్ర వేసుకుంటాయి.

ఈ స్వాతంత్ర్య సంబరాలలో ప్రస్తుతం సంతోషంగా పాలుపంచుకోలేని, రాజకీయ హద్దుల వల్ల మనతో దూరంగా ఉన్న మన సోదర సోదరీమణుల గురించి కూడా మనం ఆలోచించాలి. వారు మనవారు, మంచి, చెడులలో మనతోనే ఉండిపోతారు. వారి మంచి చెడులలో మనం ఎప్పటికీ భాగస్వాములమే. భవిష్యత్తు మనల్ని పిలుస్తోంది. మనం ఎక్కడికి వెళ్తాం? మన ప్రయత్నం ఏమిటి? భారతదేశంలోని సామాన్యులకు, రైతులకు, కార్మికులకు స్వేచ్ఛ, అవకాశాలను కల్పించడం, పేదరికం, అజ్ఞానం, వ్యాధులను అంతం చేయడం, సంపన్న, ప్రజాస్వామ్య, ప్రగతిశీల దేశాన్ని నిర్మించడం, ప్రతి పురుషుడు, స్త్రీకి న్యాయం అందించడం. చక్కని జీవితాన్ని కల్పించే సామాజిక, ఆర్థిక, రాజకీయ సంస్థలను సృష్టించడం. మనం ముందు చాలా కష్టపడాల్సి ఉంది. మన ప్రతిజ్ఞ నెరవేరేవరకు, దేశ ప్రజలందరికీ మనం కోరుకున్నట్లు జరిగే వరకు మనలో ఎవరికీ విశ్రాంతి లేదు.

మనం ఈ గొప్ప దేశపు పౌరులం. దేశ పురోగతి కోసం ధైర్యంతో, ఆ ఉన్నత ప్రమాణాలకి అనుగుణంగా జీవించాలి. మనమందరం ఏ మతానికి చెందినవారమైనప్పటికీ, సమాన హక్కులు, అధికారాలు, బాధ్యతలు కలిగిన భారతదేశపు పౌరులం. మనం మతతత్వాన్ని లేదా సంకుచిత మనస్తత్వాన్ని ప్రోత్సహించరాదు. ఎందుకంటే సంకుచిత స్వభావం, ఆలోచనలు కలిగిన వ్యక్తులు ఉన్న ఏ దేశమూ గొప్పది కాదు. ప్రపంచంలోని వివిధ దేశాలకు, ఆయా దేశాల ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాం. ప్రపంచంలో శాంతి, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కొనసాగడంలో వారితో సహకరిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాం. మనకు ఎంతో ఇష్టమైన, ప్రాచీనమైన, శాశ్వతమైన, నిత్యనూతనమైన మన మాతృభూమికి గౌరవప్రదమైన వందనాలర్పిస్తున్నాం. దేశ సేవకు పునరంకితం అవుతామని తెలియచేస్తున్నాం.

ఆపద్భాందవుడు... ప్రవీణ్ నాయక్..

- గిరి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి
- దివ్యశ్రీ పౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-నార్నూర్



సామాజిక సేవలో ముందుంటూ, గిరి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాడు దివ్యశ్రీ పౌండేషన్ చైర్మెన్ ధారవత్ ప్రవీణ్ నాయక్. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపదలో ఉన్నవారికి తనవంతు సాయం చేస్తు ఆదర్శంగా నిలుస్తున్నాడు. దివ్యశ్రీ పౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, గాదిగూడ, నార్నూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేయించి, మోటార్లు బిగించారు. నిరుపేద యువతీ, యువకుల పెళ్లి ఖర్చులు, అన్నదానం, వస్త్రదానం అందించారు. పలు చోట్ల గ్రామాలకు మట్టి రోడ్లు వేయించారు. మందిర నిర్మాణానికి మందిరంలో అన్నదానం ఏర్పాటు చేయడానికి చాలా చోట్ల విరాళాలు అందించారు. జైనూర్ గాదిగూడ మండలంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్యుల సూచనల మేరకు పలువురి రోగులకు వర్ధ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. చాలా చోట్ల నిరుపేద కుటుంబానికి వైద్య ఖర్చులు అందించారు. గ్రామాల్లో యువతను ప్రోత్సహించేందుకు కబడ్డి, ఖోఖో, క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యూత్ సభ్యులకు వివిధ అటల కిట్‌లను పంపిణీ చేశారు. ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆర్థిక స్తోమత లేని ఆటో డ్రైవర్ల కోసం లైసెన్సు ఇప్పించేందుకు ప్రణాళిక వేశారు. దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడంతో రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని సామాజిక సేవ చేయడానికి ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందుంటుందని ప్రజా సేవే ముఖ్య లక్ష్యమనీ చైర్మెన్ ప్రవీణ్ నాయక్ అన్నారు.

జెండాను గుండెల్లో ఎగరేద్దాం...



వందల సంవత్సరాల బానిస సంకెల్లనుండి విడిపడి 76సంవత్సరాల కిందట స్వాతంత్ర్య పతాకను ఎగరేసిన మన పూర్వీకుల ఘనతను స్మరించుకోవడం నేడు మనందరి కర్తవ్యం. మూడురంగుల జండా మన అస్తిత్వానికి ప్రతీక. ఆజాదీ కా అమృత్ మహెూత్సవ్ అంటే ప్రస్తుత ఏలికలవలె కేవలం మూడురంగుల జండాను ఎగురేయడం, సంబరాలు చేసుకోవడం ఎంతమాత్రం కాదు. ఆ జండా రెపరెపల వెనుక దాగున్న లక్షలాది గుండెల తపనను, వేలాది జీవితాల త్యాగాలను గుర్తుచేసుకోవడం. మన స్వాతంత్రం ఎంతవిలువైనదో, రక్తతర్పణలు చేసిన నాటి త్యాగధనుల దేశభక్తి ఎంతగొప్పదో స్మరించడం, ఆలోచించడం, వారి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం. ఇదే త్రివర్ణపతాకానికి మనమిచ్చే నిజమైన గౌరవం.

మనం గొప్పగా చెప్పుకుంటున్న ఈ కాలంలో కూడా ఒంటరిగా పోలీసుస్టేషన్‌కు వెళ్ళడానికి జంకుతున్నాం, వ్యవస్థకు వ్యతిరేకంగా గళమెత్తడానికి భయపడుతున్నాం, సామాజిక మాధ్యమంలో కూడా స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేసే సాహసం చేయలేకపోతున్నాం. అటువంటిది వందల సంవత్సరాల బానిసపాలనలో, దేశం బ్రిటిష్ కబంధహస్తాలలో విలవిలలాడుతున్న కాలంలో దేశ స్వాతంత్రం కోసం ఎలుగెత్తడమే కాదు, తమ ధన మాన ప్రాణాలను తృణప్రాయంగా భారతమాత పాదాలముందు నిండు భక్తితో సమర్పించిన నాటి స్వాతంత్ర యోధుల ఘనతను, వారి నిష్కళంక దేశభక్తిని అందిపుచ్చుకోవడమే నేడు మనముందున్న కర్తవ్యం. ప్రపంచ చరిత్రలో అత్యంత పాశవిక ఘటనగా నిలిచిపోయిన 'జలియన్ వాలాబాగ్' సంఘటన ప్రపంచానికి తెలియడానికి నెలరోజులకుపైగా పట్టిందంటే నాటి నిర్బంధాన్ని ఏమని వర్ణించాలి!

నేడు సువిశాల భారతదేశం మన కండ్లముందు సుస్పష్టంగా కనిపిస్తున్నది. కానీ, నాడు 500 సంస్థానాల రూపంలో చిన్నాభిన్నంగా ఉన్న ప్రాంతాన్ని ఒక దేశంగా ఊహించుకుని, మాతృదేశ విముక్తికోసం ఎలుగెత్తిన నాటి తరాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సింది పోయి మనలో కొందరు వారి చిత్తశుద్ధిని ప్రశ్నించడం, వికృత ఉద్దేశాలను నాటి మహనీయులకు ఆపాదించడం విడ్డూరం, దురదృష్టకరం. సర్వసత్తాక ఘనతంత్ర దేశంలో జీవిస్తూ కూడా విదేశీ పెట్టుబడులకు, సామ్రాజ్యవాదులకు దాసోహమంటున్న కొందరు నేటితరం సూడో దేశభక్తులనేమనాలి? నిర్బంధంలో కూడా రాజీపడకుండా గుండె ధైర్యాన్ని ప్రదర్శించిన, జీవితాలను తృణప్రాయంగా త్యాగంచేసిన నాటి స్వాతంత్ర యోధుల నిజాయితీని, నిష్కళంక దేశభక్తిని, ఔన్నత్యాన్ని దురుద్దేశంతో తూలనాడటం ఆకాశం మీద ఉమ్మేయడమే.

మువ్వన్నెల జండావెనుక దాగున్న మన పూర్వుల ఉద్దేశాలను, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, కులమతాలకతీతమైన శాంతి, సహనం, సామరస్యాల ఔన్నత్యాన్ని నిలబెట్టడం, కొనసాగించడంలోనే మన దేశభక్తి దాగున్నదనేది అక్షరసత్యం. ఏడున్నర దశాబ్దాల కిందట ఆ స్ఫూర్తిదాతలు మనకందించిన ఆ జయకేతాన్ని నిజంగా ఎగురేయాల్సింది మనింటి గోడలమీదనో, సందుచివర జండాగద్దెలమీదనో కాదు, మన గుండెల మీద.

ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన కలిగిఉండాలని వైద్యులు డాక్టర్ భీమ్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి శరీరంపై స్పర్శలేని మచ్చలు, చర్మము మందంగా ఉండటాన్ని గమనించిన వెంటనే డాక్టర్ ను సంప్రదించి వ్యాధి చికిత్స చేసుకోవాలని సూచించారు. ఈనెల 16 నుంచి 30 తేది వరకు ఇంటింటా సర్వే నిర్వహించాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఈఓ సూర్యప్రకాష్, ఉల్పరాణి, సూపర్‌వైజర్ దేవిదాస్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అజరామరం మన స్వాతంత్య్రం



భారతదేశం సామ్రాజ్యవాదుల చెర నుండి బయటపడి స్వతంత్ర్య దేశంగా అవతరించి 76 సంవత్సరాలైంది. స్వాతంత్ర్య సాధన కోసం నేలకొరిగిన అసంఖ్యాకుల త్యాగనిరతికి పునరంకితమయ్యే ఉద్విగ్న సమయమిది. గాంధీ, నెహ్రూ, పటేల్ అకుంఠిత పోరాట పటిమకు ముందు రాణి లక్ష్మీబాయి, మంగల్ పాండే, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ అష్ఫకుల్లా ఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్, ఉద్ధం సింగ్ వంటి ఎందరో త్యాగధనుల ఫలితమే మనం అనుభవిస్తున్న ఈ స్వాతంత్ర్యం. దేశానికి స్వతంత్రాన్ని సిద్ధించి పెట్టిన అమరవీరులకు భారత జాతి సర్వదా రుణపడి ఉంటుంది. మన స్వాతంత్ర్య సంగ్రామం అజరామరమైనది, శత్రుశేషం లేనిది. చాలా దేశాలు స్వాతంత్ర్యాన్ని పొంది ఉండవచ్చు, అట్టి స్వాతంత్ర్యం కోసం ఆ దేశ సైనికులు వీరోచితంగా పోరాటం చేసి ఉండవచ్చు, కానీ మన స్వాతంత్ర్య సంగ్రామంలో అసంఖ్యాకమైన ప్రజానీకమే అన్ని రకాల సైన్యం. అహింసా, శాంతి, సత్యాగ్రహాలే ఆయుధాలుగా పోరాడి సాధించిన ప్రత్యేకత ఇది. దేశానికి స్వాతంత్ర్యంతో పాటు, దాదాపు 12లక్షల మంది చనిపోయి, కోటిన్నర మంది నిరాశ్రయులైన, దేశ విభజన గాయాన్ని మిగిల్చిన ఆంగ్లేయుల దుర్నీతిని ఈ జాతి ఎన్నడు మర్చిపోదు. సంకుచిత వాదనతో మతరాజ్యంగా పాకిస్థాన్ ఏర్పడినప్పటికీ, ఏడు మతాలు వందలకొలది కులాలతో 22 అధికారిక భాషలు 122 బహుళ ప్రాచుర్యం గల భాషలు, 1600 ఇతర మాట్లాడగలిగిన భాషలతో విరాజిల్లుతున్న భారతదేశం సర్వమతాలకు నిలయమై లౌకిక రాజ్యంగా భిన్నత్వంలో ఏకత్వంగా విరాజిల్లుతున్నది.

200ఏండ్ల ఆంగ్లేయుల పాలన కన్నా ముందే వందల సంవత్సరాలుగా భారతదేశం విభిన్న కులాలకు, భాషలకు, ఆచారాలకు ఆలవాలమై ఉన్నది. మతమనే ప్రస్తావన అత్యాధునికమైనది. ప్రపంచంలోని అనేక దేశాల మాదిరిగానే భారతదేశంపై కూడా ఎందరో సామ్రాజ్యవాదులు దండెత్తడం, కొంతకాలం పాలన సాగించడం ఆ తర్వాత అది మరొకరి సొంతం కావడం జరిగింది. ఆక్రమించుకున్న ప్రతి ఒక్కరూ తమ మతాన్ని, అభిమతాన్ని, ఆచారాలను అమాయక ప్రజలపై బలవంతంగా రుద్ది బలిపశువులను చేశారు. దేశమంతా వివిధ సంస్థానాలుగా ఉండి, సంస్థానాధీశులు బ్రిటిష్‌కు దాసోహంగా ఉన్న పరిస్థితుల్లో విదేశీ పాలనను వ్యతిరేకించాలంటూ రాజుకుంటున్న ప్రతి పౌరుడి కాంక్షనూ మహాత్మా గాంధీ పెల్లుభికేలా చేసి పోరు మార్గం చూపారు. ఆయన ఆధ్వర్యంలో - కుల, మత, ప్రాంత, ధనిక, బీద అనే తారతమ్యాలు లేకుండా స్వతంత్ర సంగ్రామంలో ఆనాటి ప్రజలంతా పాల్గొన్నారు. నాటి స్వాతంత్ర్య సంగ్రామం కేవలం రాజకీయ మార్పు మాత్రమే కోరుకోలేదు. ప్రజా జీవన విధానాలలో మార్పు కోరుకున్నది, బానిసత్వం నుండి విముక్తి కోరుకున్నది, గౌరవప్రదమైన జీవితానికి నిర్దేశిత ఉపాధి లభ్యతను కోరుకున్నది, పాలకుల జవాబుదారీతనాన్ని, ప్రోద్భలాన్ని కోరుకున్నది.

నిజం నిప్పులాంటిది. ఆ నిప్పు కూడా అప్పుడప్పుడు కదల్చకుంటే నివురు గప్పి కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నది. చరిత్రకు సాక్ష్యాలుగా వాస్తవాలు లిఖించబడిన పుస్తకాలను కల్పిత వార్తల వాట్సాప్ ఫార్వర్డింగ్లు రీప్లేస్ చేశాయి. ఇందులో భాగంగానే స్వాతంత్ర్య సంగ్రామ హీరోలను కనుమరుగు చేసేలా ఒక దుష్ప్రయత్నం జరుగుతోంది. దండెత్తి రాజ్యాలను స్వాధీన పర్చుకున్న నియంతల వలే ప్రజాస్వామ్య యుగంలోనూ సర్వ జనుల సమ్మిళితమైన దేశ చారిత్రక ఐక్యతకు భంగం కలిగేలా అస్తిత్వ విభజన బీజాలను వెదజల్లుతున్నారు. ప్రాంతాలూ, మతాలూ, భాషలకు అతీతంగా సాగిన స్వాతంత్ర్య సంగ్రామాన్ని కొందరు మితవాదులకు ఆపాదించజూస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాల వల్ల దేశ సమైక్యత, మత సామరస్యం ప్రమాదంలో పడ్డాయి. సత్యాగ్రహం, సహాయ నిరాకణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో అభేద్యమైన పాత్ర పోషించి స్వాతంత్ర్య సాధనలో కీలకంగా నిలిచిన కార్మికవర్గానికి వారసులుగా, విచ్ఛిన్నకర శక్తుల పట్ల జాగరూకులై ఉండటం మన కర్తవ్యం.

స్వేచ్ఛ భారత్ ఏమి సాధించింది

ఈ ముప్పావు శతక కాలంలో చాలానే సాధించాం. రవాణా వ్యవస్థల నుండి భారీ ప్రాజెక్టుల నిర్మాణం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విద్యాలయాలు, వైద్య పరిశోధనలకు భారతదేశం నెలవై ఉన్నది. స్వాతంత్రం పొందిన సందర్భంలో కేవలం 14శాతానికి పరిమితమైన అక్షరాస్యత నేడు 70శాతానికి చేరింది, రూ.2 లక్షల 70 వేలుగా నమోదైన దేశ స్థూల జాతీయోత్పత్తి నేడు 2.7 ట్రిలియన్ డాలర్లకు చేరింది(210 లక్షల కోట్ల రూపాయలు). అంతరిక్ష పరిశోధనల్లో దాదాపు స్వయం సమృద్ధి సాధించుకున్నాం. త్రివిధ దళాలతో సహా పరిపాలనా సంబదిత అధికారెలుప్పుడూ ప్రభుత్వ గీత దాటలేదు. ఇది అభినందనీయం. ఆంగ్లేయుల ఆధీనంలో ఉంటే ఇవన్నీ సాధించగలిగే వాళ్ళమో కాదో చెప్పలేం. కానీ కేంబ్రిడ్జి యూనివర్సిటీ చరిత్రకారుల ప్రకారం 1700 సంవత్సరం వరకు ప్రపంచ స్థూల జాతీయ ఉత్పత్తిలో భారత్ 22.6శాతం కలిగి ఉన్నది. ఆనాటికి ఐరోపా మొత్తం 23.3శాతాన్ని మాత్రమే కలిగి ఉంది. ఆంగ్లేయులు భారత్‌ను విడిచి వెళ్లిన తర్వాత, 1952లో ప్రపంచ జీడీపీలో భారత్ 3.8శాతానికి పరిమితమైంది. ఇప్పుడది 3.09శాతం మాత్రమే. ఇవన్నీ ప్రపంచ బ్యాంకు నివేదికలోని వాస్తవాలు. స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి 80శాతం జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి స్థూల జాతీయోత్పత్తిలో 50శాతం వాటాను కలిగి ఉంది. ఇప్పుడు 60శాతం జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి స్థూల జాతి ఉత్పత్తిలో కేవలం 17శాతానికే మాత్రమే పరిమితమైంది. 76 సంవత్సరాల స్వపరిపాలనను ఇది వెక్కిరించడం లేదా? ప్రత్యామ్నాయనికి బదులు గత్యంతరం లేని ఉపాధిగా వ్యవసాయం మారింది.

1947లో ఆంగ్లేయుల పాలన అంతమై భారతీయుల పరిపాలన మొదలైంది. ఇదేనా స్వాతంత్ర్యం అంటే? ఒక జాతికి స్వాతంత్ర్యం అంటే తమను తాము స్థానిక భౌగోళిక సాంస్కృతిక పద్ధతుల ప్రకారం పాలించుకోవటమే కావచ్చు, కానీ సామ్రాజ్య వాదము ఈ 76 సంవత్సరాలలో అనేక రూపాలు తీసుకున్నది. సామ్యవాద పోకడలులేని ఏ రాజ్యమూ స్వేచ్ఛాయుత ప్రదేశం కాదు. సామ్రాజ్యవాద కాంక్ష వదిలిపెట్టని, పూర్తి పెట్టుబడిదారీ దేశమైన అమెరికా పౌరులకు అక్కడ ఉన్నంత స్వేచ్ఛా సమానత్వాలు, సమాన అవకాశాలు సమాన గౌరవాలు ప్రస్తుతం భారతదేశంతో సహా అనేక దేశాల్లో లేవు.

నామమాత్రం అవుతున్న ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఊపిరి పోస్తే పార్లమెంటు దానిని నిరాఘాటంగా కొనసాగించడానికి ప్రయత్నిస్తుంది. ఎన్నికలలో ఓటమిని అంగీకరిస్తూ అధికార మార్పిడికి అందరూ సహకరిస్తుండటం ఇప్పటికైతే మనం సాధించిన ఘనతే. రిసార్టు రాజకీయాల నేపథ్యం దీనిపై అనుమానాలు రేకెతిస్తున్నది. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల నిర్వహణకు మాత్రమే పరిమితమైపోయింది. ఎన్నికల అనంతరం ప్రభుత్వ ఏర్పాట్లలో ప్రజాస్వామ్య విధానాలు పాటించబడటం లేదు. మెజారిటీ ప్రజల ఓట్లు పొందిన రాజకీయ సమీకరణాలు గద్దెనెక్కి పరిపాలన చేస్తాయన్న నమ్మకం లేదు. ఎవరైనా ఎప్పుడైనా డబ్బులకు అమ్ముడుపోయి మెజారిటీ ప్రభుత్వాలు మైనారిటీగా, మైనారిటీ ప్రభుత్వాలు మెజారిటీగా మారుతున్న అసహజ పరిస్థితులు నేడు నెలకొన్నాయి. యదేచ్ఛగా పార్టీ ఫిరాయింపులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. పార్లమెంటు అసెంబ్లీల ఎన్నికలన్నీ కూడా ప్రజా సమస్యలపై కాకుండా కుల మత ప్రాంతీయ విద్వేషాల ఆధారంగా జరుగుతున్నవి. సమాజ అసమానతలకు కారణం కులమేనని, దాని ప్రక్షాళనకు నడుము కట్టిన అంబేద్కర్ ఆశయం కొంతైనా సాధించగలమని భావించిన వాళ్ళకి 76 సంవత్సరాల తర్వాత అదే చేదునిజం బయటపడుతోంది. కులమే ప్రధానమై రాజకీయాలను శాసించే స్థాయికి చేరింది.

ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలుగా వ్యవహరించాల్సిన శాసన నిర్మాణం, కార్యనిర్వహణ, న్యాయ వ్యవస్థ, మీడియా అన్యాక్రాంతమైపోతున్నవి. శాసన నిర్మాణాలలో సలహాలకు, మార్పు చేర్పులకు తావు లేకుండా ఏకపక్షంగా సాగుతున్నది. రైతు చట్టాలు, విద్యుత్ సవరణల బిల్లు, కార్మిక చట్టాల సవరణ, ఢిల్లీ బిల్లు వంటివన్నీ కొన్ని ఉదాహరణలు. కార్యనిర్వహణ న్యాయవ్యవస్థలు కనీసం శాసనాలను తూచా తప్పకుండా పాటించడం వదిలిపెట్టి ఆ సమయంలోని పాలకులకు ఏజెంట్లుగా వ్యవహరించే స్థితికి పడిపోయాయి. రాజ్యాంగ నిర్దేశాల కన్నా రాజుల ఆజ్ఞలకే ప్రాధాన్యమిస్తున్నాయి. నాలుగవ స్తంభమైన మీడియా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించేలా ప్రజలను మేల్కొల్ప వలసిన బాధ్యతను వదిలి ప్రభుత్వానికి వందిమాగదుల్లా వంత పాడుతూ వ్యవహరిస్తున్నది. మీడియాలోని మెజారిటీ భాగం ఇలా వ్యవహరించడం వలన కాస్తో కూస్తో ప్రశ్నించిన వారందరినీ నిర్దాక్షిణ్యంగా జైలు పాలు చేస్తున్న సంఘటనలు ఉన్నవి. మణిపూర్ ఘటనలు బయటకు రాకుండా ప్రభుత్వాలు తొక్కిపెట్టేందుకు ప్రయత్నించినా సోషల్ మీడియా ప్రభావంతో బయటకు వచ్చింది. అయినా ఆ ఘటన గురించి మాట్లాడేందుకు ప్రధాని మోడీ మాట్లాడకపోవడం బాధాకరం. ప్రధాని మోడీ మాట్లాడలేదు అని చెప్పేందుకు కూడా మెజారిటీ మీడియా సాహసం చేయలేదు. గత తొమ్మిదేండ్లకాలంలో చేయని నేరాలకు జైలు పాలై నా పత్రికా ప్రతినిధులు 22 మంది. ప్రభుత్వ తీరును, వైఫల్యాలనూ ప్రజలకు వివరించగలరన్న మేధావి వర్గాన్ని జైల్లో నిర్బంధించి కనీసం వాదించుకునే అవకాశం లేకుండా చేస్తున్న ఫాసిస్టు ధోరణి నేడున్నది.

సర్వమత సమ భావన ప్రమాదంలో ఉన్నది

భారతదేశం సర్వమతాలకు, సంస్కృతులకు ఆచారాలకు నిలయమైనప్పటికీ 76 సంవత్సరాలుగా ఐక్యంగా ఉండగలగడం గొప్ప విషయమే కాదు విజయం కూడా. అదే సమయంలో స్వేఛాయుత రాజ్యాలుగా అవతరించిన పాకిస్థాన్ వంటి అనేక దేశాల్లో ఇంత ఐక్యత కొనసాగటం లేదు. ఇంతటి సహనాన్ని, మెజారిటీ అభిప్రాయానికి గౌరవాన్నీ ప్రదర్శిస్తున్న ప్రజలూ పార్టీలూ అభినందనీయులే. కానీ ఈ ఐక్యత శత వసంతాల స్వతంత్ర భారత్ వరకు కొనసాగగలదా? సబ్కా సాథ్ సబ్కా విశ్వాస్ను గౌరవించకుండా ఇది అసాధ్యం. ఎందుకంటే ఇప్పుడు లౌకికత్వం గురించి మాట్లాడటం అంటే మెజారిటీ మతాన్ని అవమానించినట్లేనని భావించబడుతున్నది. మైనార్టీలైన ఇస్లాం, క్రైస్తవ మతాలు పరదేశీయమైనవిగా భావింపబడుతున్నవి. కేవలం భావనకే పరిమితం కాకుండా అట్టి మైనారిటీల పైన విపరీతమైన దాడులు కొనసాగుతున్నవి. హిందూ మతానికి ఈ రెండు మతాలతో వైరమున్నట్లుగా భావితరాల మెదళ్ళలో విషబీజాలు వేస్తున్నారు. ఇతర మతాల ప్రస్తావన హిందూమత మనుగడకు ప్రమాదమని తప్పుడు సంకేతాలు ప్రచారంలో పెట్టబడుతున్నవి. ఇట్లాంటి పోకడలను రాజ్యమే నేరుగా ప్రోత్సహిస్తున్నది. మతపరమైన ఏకీకరణ కోసం దేవుడి గుళ్ళ పేర భక్తి భావనను అడ్డం పెట్టుకొని ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ సమాజంలో ఒక జాతి పై మరొక జాతికి వైరం విపరీతమయ్యేలా నేటి పాలకులు వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామాలన్నీ, నివారించకుంటే, భవిష్యత్తులో తీవ్ర రూపం దాల్చి మారణహోమానికి దారి తీయవని చెప్పలేం. అభ్యుదయవాదం అంటే అసాధ్యమైనదిగా భావవాదము, భక్తివాదము అంటే ఫలితాలు ఇచ్చేదిగా ప్రజాజీవనంలో చూపించ బడుతున్నది. దీనిని తిప్పి కొట్టే వారి సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుంది. దేశ విభజనకు మత సంకుచితత్వం కారణం, మరి నేడు ఆ సంకుచితత్వం పెరిగిందా తగ్గిందా? విశాల భారత్ కోరుకునే వారు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన సమయమిది. భారత పౌరులందరూ ఓటు హక్కు వినియోగించుకోవడంలో తప్ప మరెందులోనూ సమానమైన వారు కారన్నది ఎంత నిజమో స్త్రీల వెనుకబాటుతనం స్వాతంత్రం సిద్ధించిన నాటి స్థాయిలోనే ఉన్నదనేది కూడా అంతే నిజం. మహిళల హక్కులను హరించడంలో మతాలన్నీ ఏకీభవిస్తున్నవి. ఆచారాలు సంప్రదాయాలు ఆధిపత్యం అనే గొలుసులతో బంధించి ధిక్కరించిన వారి భవిష్యత్తును అంతమొందించడంలో అందరూ పోటీ పడుతున్న ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. వెనుక బడిన జాతులలో ఒకరిద్దరికి రాజ్యాంగ పదవులు ఇచ్చి, కొన్ని కమిషన్లు ఏర్పాటు చేసి అదే దళిత గిరిజనాభివృద్ధి అని ప్రకటిస్తే నిజమైన రిపబ్లిక్ ఎలా అవుతుంది. దేశ జనాభాలో ప్రతి ఏడుగురిలో ఒక ముస్లిం ఉన్నాడు. మూడు వందలకు పైగా పార్లమెంటు సభ్యులను లను కలిగి ఉన్న బీజేపీలో ఒక్క ముస్లిం ఎం.పి కూడా లేకపోవడం వారు సబ్కా సాథ్ లేరనడానికి సాక్ష్యం. ప్రపంచానికి కోవిడ్ టీకా ఇవ్వగలిగిన దేశంలో మెరుగైన వైద్యం, వంద శాతం అక్షరాస్యత, ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ప్రయత్నాలతో ఆర్థిక అసమానతల తొలగింపే నేటి అత్యంత ఆవశ్యకంగా కనిపిస్తున్నా, మత సామరస్యం, స్వేచ్ఛాయుత వాతావరణం అత్యంత ప్రాధాన్యత ఈ 76 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉన్నది.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-ముధోల్


మండలంలోని రాంటేక్ గ్రామానికి చెందిన సుమారు 150 మంది సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరిని ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు రైతుబంధు, రైతుబీమా, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఆసరా పెన్షన్లు, ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చి ప్రతీ కుటుంబానికి ఏదో ఒక రూపంలో సాయం అందజేస్తోందని అన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై రాంటెక్ గ్రామస్తులు బీఆర్ఎస్‌లో చేరారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేరినవారిలో రాంటెక్ సర్పంచ్ వత్సలా బాయి, ఉపసర్పంచ్ జ్యోతి బొజారం, వీడీసీ అధ్యక్షులు బొజారాం, వార్డు మెంబర్లు మిలింద్, లక్ష్మణ్, సాయిరెడ్డి, భోజభాయి, గ్రామస్తులు ఎస్ భుజంగరావు, మాజీ సర్పంచ్ టి.గంగాధర్, సిద్దయ్య, వేమన రావు పాటిల్, కే శివాజీ, ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, నాయకులు సురేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఖాలీద్, మండల సర్పంచ్ సంఘం ఉపాధ్యక్షులు విజేష్, ఎంపీటీసీ ఆత్మస్వరూప్, శ్రీనివాస్ గౌడ్, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.













కోటి యాశల జెండా

పల్లవి : ఎగరవే ఎగరవే స్వాతంత్ర్య జెండా
తెలగాణ మదినిండ తేజరిల్లుచు నుండ. "2"
చరణం : శ్రీకాంత చారివై శిరమెత్తి నిలువగ
జయ శంకరుని నోట జయగాన మవ్వగ "2"
అయిలమ్మ కొమురయ్య ఆకాశ దీపమై
వినువీధులా నిండ విహరించె జెండా "2"ఎగరవే
చరణం : సకల జనుల సమ్మె ఇమ్మతిచ్చి నిలువ
జంగు సైరనూది జన నాదమై పిలువ "2"
సాగరాహారాలు సంఘటితమై కొలువ
ధర్మ యుద్ధము జేయ ధైర్య మిచ్చిన జెండ "2"
ఎగరవే
గల్లి పోరాటము ఢిల్లి కెళ్లిజొచ్చె
ధర్మ పీఠము కదిలి మన దారి కొచ్చె "2"
అరవయేండ్ల కల దీరి ఆనందమొచ్చె
బానిసత్వము వదిలె బంగారు జెండా "2"
ఎగరవే
గోలకొండ మన జాతి జనుల అండ
దక్కను వీరుల ఆకాశ కొండ "2"
అమృతోత్సవాలు ప్రతి గుండె నిండా
కోటి బురుజుల పైన కోటి యాశల జెండ
"2"ఎగరవే

చిందం ఆశన్న
తెలుగు ఉపన్యాసకులు
ఆదిలాబాద్ 504001
99480 30744
















కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పంటలపై శిక్షణ

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని తమేశా గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త యు.స్రవంతి ఆధ్వర్యంలో సోమవారం సమగ్ర పంట శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త స్రవంతి మాట్లాడుతూ వర్షాకాలంలో వివిధ ఉద్యన పంటలలో నేల దుక్కుల నుండి పంటల కోత వరకు చేయాల్సిన పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు, విత్తనాల ఎంపిక, ఎరువులు, చీడపీడల నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆసిఫాబాద్ ఉద్యానవన శాఖ అధికారి రాబిన్ వివిధ రకాల స్కీంలు, కూరగాయల పంటల విస్తరణ, ఆయిల్‌ఫామ్, పండ్ల తోటల పెంపకం గురించి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదె మారుతి, వ్యవసాయ విస్తరణ అధికారి తాండవకృష్ణ, గ్రామ పటేళ్లు, రైతులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ : పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పక వేయించాలని ఇచ్చోడ పశువైద్యాధికారి డాక్టర్ గోవింద్‌నాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని కామగిరి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 4 నెలలు పైబడిన 40 దూడలకు, 70 గేదెలకు, 30 ఆవులకు మొత్తం 140 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకడం వలన పాల సామర్థ్యం తగ్గడంతో పాటు చూడి కట్టడం తగ్గుతుందని చెప్పారు. చూడి గేదెలకు ఈ వ్యాధి సోకితే ఈసుకుపోతాయని, ఎద్దులకైతే బండిలాగే సామర్థ్యం తగ్గుతుందని చెప్పారు. అందుకనే ముందు జాగ్రత్తగా ప్రభుత్వమే ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకొని తమ పశువులను వ్యాధుల నుంచి సంరక్షించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తొడసం భీంరావు, పశు వైద్య సిబ్బంది శివ, చంద్రశేఖర్, రైతులు సాగర్, మల్లయ్య, మోహన్, రవీందర్, కిష్టయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్టీసీలో రాయితీ

నవతెలంగాణ-నిర్మల్

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భముగా ఆర్టీసీ ఆధ్వర్యంలో 60 సంవస్సరాలుపై బడిన వృద్దులకు ప్రయాణంలో 50 శాతం రాయితీ కలిపిస్తున్నట్టు డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్దులు బస్సులో కండక్టరుకు ఆధార్ కార్డు చూయించి పల్లెవెలుగు బస్‌లో టికెట్‌లో సగం ధరకే ప్రయాణం చేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వృద్దులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. రాష్ట్రంలోని పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు 50శాతం రాయితీ కల్పిస్తున్నట్టు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తిరిగే పల్లె వెలుగు సర్వీసుల్లో వెళ్లే సీనియర్ సిటిజన్లకు టికెట్‌లో 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం అభినందనీయం



నవతెలంగాణ-ఉట్నూర్

అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయడం అభినందనీయని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ అన్నారు. అసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం భూసిమెట్ట బాలికల వసతి గృహానికి చెందిన విద్యార్థిని రక్తహీనతతో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. విద్యార్థినికి అత్యవసరంగా బీ-పాజిటివ్ రక్తం కావాలని పలువురు యువకులకు కోరారు. స్పందించిన ఉట్నూర్ యువకులు జుబేర్‌ఖాన్, రహీల్ ఖాన్ ఆధ్వర్యంలో ఎంపీపీ సహకారంతో రషీద్‌ఖాన్, అడే శ్రీకాంత్ ముందుకు వచ్చి రక్తదానం చేశారు. వారిని ఎంపీపీ అభినందించారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు పొందాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

అర్హులైన కార్మికులు అందరూ లేబర్ కార్డు పొందాలని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆర్.సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే కార్మిక గుర్తింపు కార్డుల అవగాహన సదస్సు ఈనెల 17న ఇచ్చోడ మండల కేంద్రంలో ఉంటుందని అన్నారు, కార్యక్రమానికి అసంఘటిత కార్మిక రంగాల్లో పని చేస్తున్న అన్ని వర్గాల కార్మికులు భాగస్వాములు కావాలని కోరారు. నూతన లేబర్ గుర్తింపు కార్డుల పంపిణీ, పాతవి రెన్యువల్ చేసుకోవడానికి కూడా అవకాశం ఉందని అన్నారు. అన్ని మండలాల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలిగేటి అశోక్, తాపీ మేస్త్రీలు బోల ఆనంద్, గౌతం అల్నే, కోత్తురి లక్ష్మణ్ పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ నాయకత్వం తెలంగాణకు అవసరం



నవతెలంగాణ - దహెగాం

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అవసరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని మురళీగూడ గిరిజన గ్రామంలో నా మట్టి నా దేశం అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రానున్నది డబుల్ ఇంజన్ సర్కారేనని జోష్యం చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ భూములను అమ్ముకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే స్థాయికి దిగజార్చారని విమర్శించారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తే గ్రామాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్‌తో పాటు నాయకులు దామోధర్, పురుషోత్తం, సత్యనారాయణ, సంజీవ్, మల్లేష్, దుంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకంపై సోనాపూర్‌లో సర్వే

నవతెలంగాణ - వాంకిడి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తుపై సర్వే చేపట్టారు. సోనాపూర్ గ్రామ పంచాయతీలో అర్హులైన వారి వివరాలపై ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ శివకుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది సర్వే నిర్వహించారు.

కాంగ్రెస్‌లో గ్రూప్ వార్..!

- హనుమంతరావు సమక్షంలోనే ఇరువర్గాల ఘర్షణ
- కంది శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ డీసీసీ అధ్యక్షుడి నిర్ణయం
- నాయకుల మధ్య రచ్చకెక్కిన వర్గ విభేదాలు
- రసాభాసగా మారిన బీసీ ఐక్య గర్జన సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ వార్ మరోసారి బహిర్గతమైంది. గ్రూపుల గోల ఈ పార్టీలో సాధారణమైనప్పటికీ.. ఇటీవలి కాలంలో మరింత రెచ్చకెక్కాయి. ఇన్నాండ్లు మూడు గ్రూపులు ఉండగా.. తాజాగా నాలుగో గ్రూపు తయారు కావడంతో వీరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డిలు ముగ్గురు ఒక్కటై కార్యక్రమాలు చేపడుతున్నా..ఇటీవల పార్టీలో చేరిన కంది శ్రీనివాస్‌రెడ్డి మాత్రం వేరుగా కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నారు. కాగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీసీ ఐక్య గర్జన సభ ఆయా గ్రూపుల మధ్య ఘర్షణకు దారితీయడం ఆ పార్టీలో వర్గవిభేదాలు మరింత పొడచూపాయి. పార్టీకి చెందిన మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు సమక్షంలోనే ఇరు గ్రూపులకు చెందిన కార్యకర్తలు గొడవ పడ్డారు. తాజాగా కంది శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ నిర్ణయం తీసుకోవడం మరింత చర్చకు దారితీస్తోంది. ఈ వర్గవిభేదాలు పార్టీ అధిష్టానం దృష్టికి కూడా వెళ్లినట్లు తెలుస్తోంది.

అసలు ఏమైందంటే..!

జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగిని ఫంక్షన్ ఫంక్షన్ హాల్‌లో బీసీ ఐక్య గర్జన సభ ఏర్పాటుచేశారు. ఈ సభకు మాజీ రాజ్యసభ సభ్యుడు, సీనియన్ నాయకుడు వి.హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతతో పాటు సంజీవ్‌రెడ్డి వర్గం నాయకులు పాల్గొన్నారు. ఈ సభకు హాజరయ్యేందుకు వచ్చిన కంది శ్రీనివాస్‌రెడ్డిని కొందరు కార్యకర్తలు గేటు దగ్గరే నిలిపివేశారు. దీంతో కంది వర్గం కార్యకర్తలు, బౌన్సర్లు గేట్లను నెట్టుసుకుంటూ సభ వేదిక వద్దకు వచ్చారు. శ్రీనివాస్‌రెడ్డికి అనుకూలంగా వారి కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో సభలో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడటంతో పాటు ఇరువర్గాల కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో హనుమంతరావుతో పాటు గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్‌లు అక్కడ్నుంచి వెళ్లిపోయారు. అనంతరం కంది శ్రీనివాస్‌రెడ్డి సైతం అక్కడ్నుంచి వెళ్లిపోవడంతో మళ్లీ సభను ప్రారంభించారు.

కంది వ్యవహారంపై మండిపడ్డ వీహెచ్

ఈ సందర్భంగా బీసీ గర్జన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన హనుమంతరావు మాట్లాడుతూ సంస్కారంతో కూడిన రాజకీయాలు చేయాలని ఇలా బౌన్సలర్లను పట్టుకొని వచ్చి బెదిరిస్తే ఎవడు బయపడరని కంది శ్రీనివాస్‌రెడ్డిపై మండిపడ్డారు. బీసీలకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిందే సోనియాగాంధీ అని, ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమి నెరవేర్చలేదన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేసారని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు.

కంది శ్రీనివాస్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ మాట్లాడుతూ.. కంది లాంటి నాయకుడు మాకు అవసరం లేదని పార్టీ నుండి ఇప్పుడే బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. 6 సంవత్సరాలు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటి నుండి ఆయనకు మాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను ఎన్ని కార్యక్రమాలు, మీడియా సమావేశాలు ఏర్పాటు చేసిన ఒక్కసారి కూడా ఆహ్వానించలేదని అన్నారు. ఇటీవల మీడియా సమావేశంలో పార్టీ అధ్యక్షున్ని పట్టుకొని ఇష్టారీతిన విమర్శలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ జరిగిన ఘటనలో తమ నాయకులపై దాడి చేశారని ఆసుపత్రికి వెళ్లారని అన్నారు. డబ్బులు ఉన్నాయనే అహంకారంతో ఇలా చేస్తున్నారని మండిపడ్డారు.



బీసీల ఐక్యతను దెబ్బతీసేందుకు యత్నం

ఈ సందర్భంగా గండ్రత్ సుజాత మాట్లాడుతూ బీసీల ఐక్యతను దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు. కాంగ్రెస్ సంస్కృతి గురించి కంది తెలుసుకోవాలన్నారు. ఈ సభలో ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేమంతా ఒక్కటే...ఎమ్మెల్యేను ఓడించడమే లక్ష్యం

- పార్టీలో చొరబొడ్డ సంఘ విద్రోహక శక్తులు
- కాంగ్రెస్‌లో ఇలాంటి ఘటనలు సర్వసాధారణం



బీసీ ఐక్యవేదిక సభకు హాజరు కాకుండా గేట్లకు తాళాలు వేయడం, తనను అడ్డుకోవడం దురదృష్టకరమని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లడారు. ముందుగా బీసీ ఐక్యవేదిక సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావుకు ధన్యవాదాలు తెలిపారు. బీసీల ఐక్యత కోసం గళమెత్తిన తనను లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి చొరబడ్డ కొన్ని సంఘ విద్రోహక శక్తుల కారణంగానే ఈ సంఘటన చోటుచేసుకుందన్నారు. తామంతా కాంగ్రెస్ కుటుంబంగా ఒకే గొడుగు కింద పని చేస్తామని, దీన్ని పెద్దగా పట్టించుకోవద్దని, అతి పెద్ద కాంగ్రెస్ పార్టీ కుటుంబంలో ఇలాంటి చిన్న చిన్న ఘటనలు సర్వసాధారణమని తెలిపారు. కుటుంబంలో సమస్యలు సర్దుబాట్లు మామూలే అని తెలిపారు. ఇది టీ కప్పులో తుఫానులా త్వరలోనే సమసిపోతుందని అన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని పేర్కొన్నారు. తామంతా కలిసికట్టుగా పని చేసి స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నను ఓడించడం, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని తెలిపారు.

మహిళా కమిషన్ సభ్యురాలు విచారణ

- మా హెచ్‌ఎం మాకే కావాలే : విద్యార్థుల ఆందోళన



నవతెలంగాణ - బెజ్జూర్

బెజ్జూర్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పార్తిరాం విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంపై ఆరోపణలు రావడంతో సోమవారం ఉమ్మడి జిల్లా మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి విచారణ చేపట్టారు. విద్యార్థినులు, బాధితురాలు, ఆమె తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై సమాచారాన్ని సేకరించారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విచారణలోని అంశాలను మహిళా కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని, ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తామని పేర్కొన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని, పురుష ఉపాధ్యాయులను నియమించకుండా పీఓ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆమె వెంట ఏటీడీఓ కమర్ హుస్సేన్, డీసీఎంఎస్‌ఐ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య, జెడ్పీటీసీ పుష్పలత ఉన్నారు.

మా హెచ్‌ఎం మాకే కావాలే

గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పార్తిరాంను తిరిగి పాఠశాలలోనే ఉంచాలని కోరుతూ విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఉదయం టిఫిన్ చేయకుండానే బ్యాగు పట్టుకొని ఆశ్రమ పాఠశాల నుండి బయటకు వెళ్లడానికి ప్రయత్నించారు. దీన్ని గుర్తించిన వాచ్‌మెన్, ఉపాధ్యాయులు విద్యార్థులను వారించడంతో కాసేపు గేటు ముందే బైటాయించి నిరసన తెలిపారు. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్తిరాం తమను మంచిగా చూసుకొనేవారని, మా హెచ్‌ఎం మాకే కావాలంటూ నినాదాలు చేశారు. వారికి ఉన్నతాధికారులు ఫోన్ ద్వారా నచ్చజెప్పడంతో తిరిగి పాఠశాలకు వెళ్లారు. విద్యార్థులతో ఫోన్ ద్వారా డీసీడీఓ శకుంతల మాట్లాడి విద్యార్థులను సముదాయించారు. తాము వచ్చి విచారణ చేస్తామని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో వారు తిరిగి పాఠశాలకు వెళ్లారు.



సోనేరావుపై దాడిచేసిన వారిని శిక్షించాలి

- ఆదివాసుల ఆధ్వర్యంలో రాస్తారోకో



ఇంద్రవెల్లి : ఆదివాసీ నాయకుడు సోనేరావుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సోమవారం స్థానిక అంబేద్కర్‌చౌక్‌లోని ప్రధాన రహదారిపై గంట సేపు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుడు కొడప నగేష్ మాట్లాడుతూ ఆదివాసీ కోలాం నాయకుడు సోనేరావుపై జిల్లా కేంద్రంలో కొందరు వ్యక్తులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ నాయకులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని వెల్లడించారు. దీంతో పాటు ఎంపీ సోయం బాపురావును కించపర్చిన వారిపై సైతం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ తుడుందెబ్బ జిల్లా, మండల కమిటీని పూర్తిగా రద్దు చేస్తూ గ్రామ పటేళ్లు, రాయి సెంటర్ల ఆధ్వర్యంలో కేస్లాపూర్‌లో జరిగిన సమావేశంలో తీర్మానించామన్నారు. కొందరు తుడుందెబ్బ నాయకుల పేరిట ఆదివాసీ గ్రామాల్లో చెలామణి కావడం తమ దృష్టికి వచ్చిందన్నారు. పాత కమిటీల పేరిట గ్రామాల్లోకి వస్తే వారిని తిప్పి పంపాలని పేర్కొన్నారు. రాస్తారోకోతో ఉట్నూర్, మంచిర్యాల వైపు వెళ్లే వాహనాలకు గంట సేపు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై డి.సునీల్ రాస్తారోకో వద్దకు చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో పాటు బాధితుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ రాస్తారోకోలో ఆదివాసీ నాయకులు సో యం రామ్‌దాస్, బాగోరావ్, భీమ్‌రావ్, నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తాం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



కుభీర్: పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్ట కింద పొలాలను, తెగిపోయిన ఎల్లమ్మ చెరువు కట్టను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులతో తక్షణమే సర్వేలు జరిపించి నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రైతులు అధైర్యపడొద్దని, నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం లక్ష వరకు రైతులకు రుణమాఫీ ప్రక్రియ కూడా ప్రారంభించిందన్నారు. రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో రుణమాఫీ జరుగుతుందని పేర్కొన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరిస్తామని తెలిపారు. అంతకు ముందు చోండి గ్రామంలో రూ. 45లక్షలతో నిర్మించే శివాలయం పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, వైస్ ఎంపీపీ మోహినుద్దీన్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, సర్పంచ్ మీరా విజయ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కందుర్ సంతోష్, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు పుప్పాల పీరాజి, ఆయా గ్రామాల సర్పంచులు నర్సారెడ్డి, దత్తుగౌడ్ పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర ప్రభుత్వం దళితుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బుద్ధనగర్‌లో ఆయన నాయకులతో కలిసి పర్యటించి, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళిత సీఎం అని మాయమాటలు చెప్పి మోసం చేశారని పేర్కొన్నారు. ఖానాపూర్ నియోజవర్గంలో ఏ ఊరిలో చూసిన దళిత, గిరిజన వాడలలో దుర్భరమైన పరిస్థితులున్నాయని తెలిపారు. పేద దళితులను గుర్తించి దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరు వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు ఇప్పటివరకు పింఛన్ రాలేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖాడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమాసే వెంకట్‌రావు, సేవాదళ్ మండల అధ్యక్షుడు చాహకటి మానిక్‌రావ్, జిల్లా నాయకులు సోన్‌కాంబ్లే జితేందర్, గాయక్‌వాడ్ భగవాన్, మండల సోషల్ మీడియా ఇంఛార్జి డవలే ప్రశాంత్, భీం ఆర్మీ మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, నాయకులు వాగ్మారే సంజీవ్, సామాజిక కార్యకర్త సోన్ కాంబ్లే బాబాసాహెబ్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
మంగళవారం 15 ఆగస్టు 2023

మాజీమంత్రి కుటుంబాన్ని పరామర్శించిన వీహెచ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దివంగత మాజీ మంత్రి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు సోమవారం పరామర్శించారు. అంతకుముందు జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కాగా జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో బాధిత కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతకుముందు రామచంద్రారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, కౌన్సిలర్ అంబకంటి అశోక్, నాయకులు సాదిక్, షేక్ కలీం, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ ఆదివారం గుండె పోటుతో మృతి చెందాడు. వడూర్ గ్రామానికి చెందిన పందెం ఉశన్న అనారోగ్యం కారణంగా మృతి చెందిన విషయం తెలుసుకొని సోమవారం నేరడిగొండ జెడ్పీటీసీ అనీల్ జాదవ్ మండల నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించి, ఓదార్చరు. అనంతరం మండల నాయకులతో కలిసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు మండల అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అనిల్ అన్న యువ సైన్యం అధ్యక్షులు షేక్ అఫ్రోజ్, నాయకులు తిరుమల్‌గౌడ్, కేదరీశ్వర్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి, రాజన్న, శ్రీనివాస్ రెడ్డి, గంగయ్య, గజనన్, రమేష్ ఉన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మద్యానికి బానిసై యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఉండం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండం గ్రామానికి చెందిన కల్లూరి చంద్రకాంత్(36) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు చంద్రకాంత్ భార్య గత సంవత్సరం రైలు ప్రమాదంలో మరణించగా అప్పటి నుంచి మద్యానికి బానిసై ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సోమవారం చంద్రకాంత్ మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని పోస్ట్ మార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

నవతెలంగాణ-తలమడుగు

ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని సుంకిడి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన గోనెల హరీష్(17)పై ఆటో బోల్తాపడి మృతి చెందాడు. సుంకిడి గ్రామంలో నుంచి ప్రయాణికులతో కొత్తూరు గ్రామానికి వెళ్లి ప్రయాణికులను దింపి తిరిగి వస్తుండగా సుంకిడి గ్రామ సమీపంలోని భీమన్న వాగు వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా డ్రైవర్ నవీన్ ఆటో నడపడంతో ప్రమాదం జరిగింది. వెంటనే గాయపడ్డ హరీష్‌ను 108 వాహనంలో రిమ్స్‌కి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ గొల్లపల్లి నవీన్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని బోథ్ సీఐ భీమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు దేగామ గ్రామంలో సీసీ కెమెరాలు, గంజాయి, సైబర్ క్రైమ్, వాహనదారులకు జాగ్రత్తల గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నేరాలను అదుపు చేయవచ్చని అన్నారు. దొంగతనాలు నివారించే అవకాశం ఏర్పడుతుందన్నారు. దొంగతనం జరిగినా పరిస్థితిలో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవచ్చని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేష్, సర్పంచ్ లక్ష్మణ్, ఉపసర్పంచ్ విలాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనథ్ మండలంలోని పూసాయి గ్రామానికి చెందిన సిరుగురి అశోక్ ఇల్లు గత 6 రోజుల కింద షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైంది. దీంతో బాధిత కుటుంబం రోడ్డున పడ్డారని జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. ఈ విషయమై సోమవారం ఆయన నివాసంలో మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ఇప్పటివరకు ఏ అధికారి, నాయకుడు పరామర్శించి ఆదుకోలేదని అన్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ చొరవ చూపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా వ్యతిరేక ఫాసిస్టు పరిపాలనను వ్యతిరేకించాలి

నవతెలంగాణ-నిర్మల్

మోడీ నిర్బంధ, అప్రజాస్వామిక పాలనను వ్యతిరేకించాలని రైతు జేఏసీ, ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా నేటికీ పాలకులు బ్రిటీష్ సామ్రాజ్యవాదులు అనుసరించిన విధానాలనే కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ హక్కులు అమలు కావడం లేదని, దేశ ప్రజలపై ఫాసిస్ట్ నిర్బంధం అమలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగంపై, కార్మికులపై, ఆదివాసులపై, మహిళలపై, అణగారిన దళితులపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జే.రాజు, జిల్లా అధ్యక్షులు మహమూద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

నవతెలంగాణ-తాంసి

మండలంలో శాంతిభద్రతలకు అందరూ సహకరించాలని ఎస్ఐ బి.శివరాం అన్నారు. సోమవారం నూతనంగా వచ్చిన ఎస్ఐని పోలీస్‌స్టేషన్‌లో సీపీఐ మండల కార్యదర్శి చిలక దేవిదాస్ కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలకు చెందిన పార్టీల నాయకులు, ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు ఎల్లవేళలా రావచ్చని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

నవతెలంగాణ-నార్నూర్

గ్రామాభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని అడిషనల్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. సోమవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో నిర్మించిన పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, క్రిమిటోరియా, నర్సరీ పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలు రాని చోట్ల వేరే మొక్కలను నాటాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఆదేశించారు. వారి వెంట డీఎల్పీఓ భిక్షపతిగౌడ్, ఎంపీడీఓ రమేష్, స్థానిక సర్పంచ్ మధుకర్, ఉపసర్పంచ్ విష్ణు, టీఏ సాదిక్, కార్యదర్శి శేఖర్ ఉన్నారు.

సంక్షేమ పథకాలతోనే మూడోసారి అధికారంలో వస్తాం



నవతెలంగాణ-ఉట్నూర్

సంక్షేమ పథకాల అమలుతోనే సీఎం కేసీఆర్ మూడోసారి అధికారంలో వస్తారని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తగూడె చెక్ పోస్ట్ నుంచి తెలంగాణ చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలుగు తల్లి, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలను పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. గిరిజన, ఆదివాసీ గ్రామాలను గూడాలను తండాలను మరింతగా అభివృద్ధి చేసిందని అన్నారు. రాబోయే రోజుల్లో మూడోసారి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా మనమందరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, యువకులు ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మావల మండల కేంద్రంలోని మసీదు ఆవరణలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన దుకాణ సముదాయాలను ప్రారంభించారు. అదేవిధంగా వైకుంఠ ధామంలో రూ.5లక్షలతో ఏర్పాటు చేయనున్న హైమాస్ లైటింగ్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా సమగ్రాభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల హయంలో నిరాదరణకు గురైన వర్గాలకు సీఎం కేసీఆర్ సారధ్యంలోని ప్రభుత్వం అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. మైనారిటీలు అభివృద్ధి పథంలో నడవాలన్న సదుద్దేశంతో వారి సంక్షేమానికి తగు ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, బీఆర్ఎస్ నాయకులు యూనిస్ అక్బానీ, ఆరిఫ్, నల్ల రాజేశ్వర్, ఏవన్, రాజన్న పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరంజి ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలలో ఉన్న 29 గర్భిణీ స్త్రీలకు రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సలహాలు సూచనలు చేసి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిల్ రాజ్ మాట్లాడుతూ సంపూర్ణ పోషకాహారం ప్రాధాన్యత, కాన్పుల, కాన్పుల మధ్యవ్యవధి కోసం తాత్కాలిక పద్ధతులైన నిరోధ్, ఓరల్ పిల్స్, అంతర ఇంజెక్షన్, పీపీఐయూసీడీ గాని ఉపయోగించుకోవాలని అన్నారు. తద్వారా తల్లి పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, ఆరోగ్యంగా, మానసికంగా, ఆర్థిక పరంగా ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమంలో ఈ విధంగా మాతాశిశు సంరక్షణ చేయడం జరుగుతుందని అన్నారు. మన ఉపకేంద్రాల సిబ్బందితో సకాల పరీక్షలు, ఆరోగ్యసలహాలు, వారు తెలిపిన ఆరోగ్య అవగాహనను పాటించాలని అన్నారు. అనుబంధ పోషకాహారంను సంబంధిత అంగన్వాడీ కార్యకర్తల నుంచి తీసుకోవాలని అన్నారు. ప్రతిరోజు గుడ్లు ఆకుకూరలు పండ్లను తినాలని అన్నారు. సురక్షిత కాన్పు కోసం మా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రమాదభరిత లక్షణాల గల ఇద్దరు గర్భిణీ స్త్రీలను రిమ్స్‌కు పరీక్షలు, చికిత్సల కోసం పంపడం జరిగిందని తెలిపారు. రోడ్డు సౌకర్యం సరిగా లేని గర్భిణీలను పదిరోజుల ముందుగా ఆరోగ్య కేంద్రంలో ఉంచుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్ర ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు కె.లూసి, బి.గంగాధర్, స్టాఫ్ నర్స్ పూర్ణిమ, ఆరోగ్య కార్యకర్త సుజాత, బాగ్యవతి, విష్ణుకుమార్, ఫార్మాసిస్ట్ అశోక్ రెడ్డి, ప్రయోగశాల నిపుణులు సంతోష్, సిబ్బంది రేఖ పాల్గొన్నారు.

అమరులైన పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



స్వాతంత్ర్యం కోసం అమరులైన పోరాట యోధుల త్యాగలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని డైట్ మైదానంలో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన మహనీయుల జీవిత చరిత్రలతో కూడిన ఫోటోలను తిలకించి నిర్వాహకులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల జీవిత చరిత్ర నేటి తరం విద్యార్థులకు తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహనీయులు అందించిన స్ఫూర్తితో దేశాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

సొనాల ఫైనల్ గెజిట్ విడుదల చేయాలి



తెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల ప్రాంత ప్రజల సుదీర్ఘ పోరాటం తర్వాత ప్రభుత్వం ప్రాథమికంగా సొనాల మండల ఏర్పాటుకు గెజిట్ విడుదల చేయడం జరిగింది. అలాగే సోమవారం రెవెన్యూ డివిజన్ సాదన సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ సుభాష్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ సాదన సభ్యుడు పసుల చంటి మాట్లాడుతూ అభ్యంతరాలు స్వీకరించే సమయం ముగిసిపోయినందున అభ్యంతరాలు ఏమీ లేకున్నా మండల ఏర్పాటుకు సంబంధించి ఫైనల్ గెజిట్ విడుదల చేయడం లేదని అన్నారు. నూతన కార్యాలయాల స్థల పరిశీలన జరగలేదని అన్నారు. ప్రభుత్వ అధికారిక సైట్లలో సొనాల మండల పేరు కనిపించకపోవడంతో అనేక అపోహలకు కారణమవుతుందని అన్నారు. వెంటనే నూతన మండల ఏర్పాటును ప్రారంభిస్తూ ఫైనల్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అలాగే ఉమ్మడి మండలంలో ఒకటి మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటం ఇప్పుడు రెండు మండలాలుగా విడిపోవడంతో మారుమూల ప్రాంతాలైనటువంటి దన్నూర్(బి), మర్లపెల్లి గ్రామాలలో నూతన ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన సమితి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు, ఇర్షద్ అలీ అబుద్, అనిల్ మాసం, నారాయణ పాల్గొన్నారు.

అర్హులైన బీసీలకు రుణాలు అందించాలి

నవతెలంగాణ-తలమడుగు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ ఆర్థిక చేయూత అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల దత్తు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ రమాకాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి బీసీ రుణాలు అందించాలని కోరారు. మండలంలో 813 లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోగా అందులో 395 మాత్రమే మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. మిగతా వాటిని కార్యాలయంలో పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జాబితాను ఉన్నతాధికారులకు పంపించాలని ఎంపీడీఓను కోరారు. అర్హులైన వారికి అందివ్వకపోతే సంఘం పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మేకల రవికాంత్ యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు అసం రవీందర్, సంఘం నాయకులు సాంబశివ్, రమాకాంత్, పురుషోత్తం, నవీన్, ప్రవీణ్, రాములు, రాము, శ్రీనివాస్, లస్మన్న, రవి, సంతోష్, మల్లయ్య యాదగిరి, వివిధ గ్రామాల బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిప్పల్‌ధరిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాని తీర్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

పిప్పల్‌ధరిని మండలంగా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఖండాల గ్రామస్తులు తీర్మానం చేశారు. సోమవారం ఖండాల గ్రామంలో పిప్పల్‌ధరి మండల సాదన కమిటీ అధ్యక్షులు తెలంగ్ బాపురావ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ గ్రామాన్ని కలుపుకొని పిప్పల్‌ధరిని మండల కేంద్రంగా ప్రకటించాలని తీర్మాణం చేశారు. తీర్మాణం కాపిని ప్రభుత్వానికి అందజేయాలని తెలంగ్ బాపురావ్‌ను కోరారు. ఈ సందర్భంగా తెలంగ్ బాపురావ్ మాట్లాడుతూ ఖండాల, దార్‌లొద్ది(కె), మొలాల్‌గుట్ట, పోతగూడ, పాటగూడ గ్రామలు ఆదిలాబాద్ మండల కేంద్రానికి 25 నుంచి 30కిలో మీటర్ల దూరంలో ఉంటారని అన్నారు. మండల కేంద్రానికి రావాలంటే సమయానికి ఆటోలు, బస్సులు ఉండవని అన్నారు. అదే పిప్పల్‌ధరి మండలంగా ఏర్పాటు చేస్తే, ఇక్కడి ప్రజలకు దూరభారం తగ్గుతుందని అన్నారు. పిప్పల్‌ధరి మండలంగా ఏర్పాటు చేసేంత వరకు పోరాడాతామని ఖండాల గ్రామస్తులకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ మానిక్‌రావు, గ్రామ పటేల్ దేవిదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో యువకుల జల విన్యాసాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం కోసం పలువురు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఈత కొలనులో యువకులు జాతీయ జెండాలతో జల విన్యాసాలు నిర్వహించారు. స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో ఈత సాధకులు జెండాలతో వివిధ విన్యాసాలు ప్రదర్శించారు. ఒక చేతిలో జెండాలు, మరో చేతితో ఈత కొడుతూ తమ దేశభక్తిని చాటారు. విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

గిరిజన రైతులకు స్ప్రే డబ్బాలు పంపిణీ

నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వెల్ఫేర్ విశ్వవిద్యాలయం ద్వారా ఉప ప్రణాళిక కింద సోమవారం మండలంలోని గుండివాగు గ్రామానికి చెందిన గిరిజన రైతులకు మంజూరు ఐనా ఎలక్ట్రానిక్ స్ప్రే డబ్బలను ఉచితంగా పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఓ కైలాష్ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జనవరి నెలలో ఉచితంగా నువ్వుల విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా మంజూరు ఐనా స్ప్రే డబ్బలను గిరిజన రైతులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండివాగు రైతులు దత్తు, నారాయణ, యోగేష్, ఎల్లన్న, కొమురన్నా, భీంరావు పాల్గొన్నారు.

స్వాగత తోరణం ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అదిలాబాద్ మండలంలో భీంసరి అభివృద్ధిలో భాగంగా భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ సొంత నిధులతో ఏర్పాటు చేసినటువంటి స్వాగత తోరణాన్ని అంగరంగ వైభవంగా ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించారు. అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్, హన్మాండ్లు, రాజేష్, ఈరన్న, శంకర్, నర్సిములు, గంగన్న, అంబదాస్, ఉశన్న, రాజు, భీంసరి గ్రామస్తులు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, డీఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు, అతిథులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కలెక్టర్ వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా ప్రణీత్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్‌గా ఎస్. ప్రణీత్ సోమవారం జిల్లా కేంద్రంలోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కరీంనగర్ డిపో మేనేజర్ నుంచి డిప్యూటీ ఆర్ఎంగా పదోన్నతి లభించిందని తెలిపారు. దాదాపు కొన్ని సంవత్సరాల నుంచి ఈ పోస్ట్ కాళీ ఉండగా నేడు భర్తీ అయిందని తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్‌లకు ఇచ్చిన రాయితీ మంగళవారం ఒక్కరోజే ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీని ఆదరించాలని అన్నారు.

ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఎంపీ సోయం బాపురావు దిష్టి బొమ్మను జిల్లా కేంద్రంలో దహనం చేయడం సమాజానికి సిగ్గు చేటని వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఖైర్‌డాట్వా, బలాన్‌పూర్ గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడప సోనేరావుపై మహిళలను పెట్టి దాడి చేయించిన దుండగులను యావత్ ఆదివాసీ సమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అదివాసీ సమాజంలో ఉన్న రాయిసెంటర్ వ్యవస్థ గ్రామ పటేల్ వ్యవస్థలో కూర్చొని చర్చ చేయాల్సి ఉంటుందని అన్నారు. గ్రామాల్లో మహిళలను చీల్చే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని మహిళా నాయకులు అన్నారు. ఇందులో మడావి అనవంతి, పెందోర్ లింగు బాయి, మడావి పుల్లు బాయి, కుంరా పారు బాయి, ఆత్రం ఎత్మ బాయి, బలాన్‌పూర్ రాయిసెంటర్ సార్మెడి భగవంత్‌రావ్, మారుతి పటేల్, పేందుర్ దవంతి, పూసం ఇస్తు, కుంరా జైతు, ఆత్రం రాము, తెలంగ్ రావ్, జంగు ఉన్నారు.

విభజన బాధలని ఎన్నటికీ మర్చిపోలేం



నవతెలంగాణ-బోథ్

దేశ విభజన ఘట్టాన్ని భారత దేశం ఎన్నటికీ మర్చిపోలేనిదని గిరిజన మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో దేశ విభజన భయానక దివస్ సందర్భంగా మూతికి నల్ల బ్యాడ్జీలను ధరించి మౌన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సాకటి దశరథ్ మాట్లాడుతూ బ్రిటిష్ వారి కుటిల నీతికి, కాంగ్రెస్, ముస్లిం లీగ్ అధికార దహానానికి 1947 ఆగష్టు 14 న దేశ విభజన జరిగిందన్నారు. ఈ సమయంలో జరిగిన విద్వేషానికి లక్షలాది మంది భారతీయులు బలయ్యారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుభాష్ సూర్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజి, బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తే, జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్‌రావు ఆమ్టే, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి చాబంతుల కృష్ణ, బోథ్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ బోరే రవీందర్, బీజెవైఎం జిల్లా కార్యదర్శి రంజిత్ సింగ్, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు బారె భోజన్న, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి కార్తిక్ యాదవ్, మండల కార్యదర్శిలు కుర్మే రాజన్న, సంగేపు శంకర్, పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
మంగళవారం 15 ఆగస్టు 2023

పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

బెజ్జూర్ : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో 15వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం 2కే రన్ నిర్వహించారు. ఎస్సై విక్రమ్ జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. 2కే రన్‌కు బెజ్జూర్ నుండి భారీ ఎత్తున యువకులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన యువకులకు ఎస్సై ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోటీ పరుగు కాకుండా ఐక్యతను చాటుతూ యువత 2కే రన్‌ను విజయవంతం చేశారన్నారు.

బదిలీపై వచ్చిన జీఎంకు సన్మానం

రెబ్బెన : ఇటీవల బెల్లంపల్లి ఏరియాకు బదిలీపై నూతనంగా వచ్చిన జీఎం డి రవిప్రసాద్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆజ్మీర ఆత్మారాం నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు ఉన్నారు.

ఇంటింటికి జాతీయ జెండాలు పంపిణీ

నవతెలంగాణ-రెబ్బెన



ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని గోలేటిలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాడు కృష్ణకుమారి, మండల ప్రధాన కార్యదర్శి చేకూరి నవీన్‌గౌడ్ జాతీయ జెండాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు బక్కిన రమేష్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ సుంకరి రాజు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న 77వ స్వాతంత్ర్య వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ సుంకరి రాజు హాజరుకానున్నారు. కలెక్టరేట్ ఆవరణలో ముఖ్య అతిథి చేతుల మీదుగా ఉదయం 11 గంటలకు పతకావిష్కరణ చేస్తారని తెలిపారు. ఉదయం 11:05 గంటలకు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా అభివృద్ధిపై ముఖ్య అతిథి ప్రసంగం ఉంటుందన్నారు. అనంతరం 11:30 నుండి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, 12 గంటలకు వివిధ శాఖలో పనిచేసిన ఉత్తములకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. ఏర్పాట్లను ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌తో పాటు అదనపు కలెక్టర్ ప్రదీప్ తివారి పరిశీలించారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న గణితం అధ్యాపక పోస్టును తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో గణితం బోధించుటకు ఆసక్తి గల వారు ఈ నెల 16వ తేదీన ఉదయం 10గంటలకు ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో వచ్చి డెమోకు హాజరు కావాలని సూచించారు. వేతనం గరిష్టంగా నెలకు రూ.18200 ఉంటుందని పేర్కొన్నారు.

ఉచిత వృత్తి శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకోవడానికి ఆసక్తి గల మహిళల (సింగరేణి ఉద్యోగస్తుల డిపెండెంట్స్, మాజీ ఉద్యోగస్తుల డిపెండెంట్స్, భూ నిర్వాసితుల) నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు సిరంప్రియ జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఒక ప్రకటన పేర్కొన్నారు. శ్రీరాంపూర్ పరిసర ప్రాంత కాలనీ వాసులు టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, క్లాత్, జ్యూట్, బంజార బ్యాగ్స్ మేకింగ్ కోర్సులను నేర్చుకొనుటకు ఆసక్తి గల మహిళల నుండి దరఖాస్తులను కోరారు. తమ ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్స్, కులం సర్టిఫికెట్, రెండు ఫోటోలతో పాటు పూర్తి వివరాలతో తమ సంబంధిత గని అధికారి ద్వారా ఆగస్టు 20 లోగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో అందచేయగలరని కోరారు.

నేడు సీనియర్ సిటిజన్‌లకు ఆర్టీసీ రాయితీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు ఆర్టీసీలో ప్రయాణం చేసే సీనియర్ సిటిజన్లకు రాయితీ ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ ఫ్రేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని పల్లె వెలుగు బస్సులలో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు రాయితీ కల్పిస్తున్నట్లు, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తిరిగే పల్లె వెలుగు సర్వీసుల్లో వెళ్లే సీనియర్ సిటిజన్‌లకు టికెట్లు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపినారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుల వివక్షతకు తావివ్వొద్దు



నవతెలంగాణ-కోటపల్లి

గ్రామ ప్రజలు శాంతి పరిరక్షణకు సహకరించాలని సోమవారం కోటపల్లి ఎస్సై సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని జనగామ గ్రామంలో ప్రజలకు కుల వివక్షతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సమానమే అందరమూ మనమే అనే సిద్ధాంతంతో ఉండాలని అన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలను పరిశీలించి సౌకర్యాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్సై సురేష్, ఎంపీటీసీ తిరుపతి పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో నిర్వహించే పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ రహీమొద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం జాతీయ జెండాను ఆవిష్కరించడం జరుగుతుందని, మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులతో వచ్చిన అర్జీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను ఆయా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిశీలించి పరిష్కరించే దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 25 26 27 తేదీల్లో నిర్వహించ తలపెట్టి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 16వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. ఇందారం-1 ఏ గనిపై ఫిట్ సెక్రటరీ చింతల నవీన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 25న గోదావరిఖని చౌరస్తాలో కార్మికుల బల ప్రదర్శన సాయంత్రం నాలుగు గంటలకు ఉంటుందని తెలిపారు. దీనికి కార్మికులు పెద్ద ఎత్తున హాజరు కవాలని పిలుపునిచ్చారు. కోల్ ఇండియాలో ఆగస్టు నెల జీతం సెప్టెంబర్‌లో చెల్లిస్తున్నందున సింగరేణిలో కూడా అదే విధంగా చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించారు. అనంతరం గని మేనేజర్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజినల్ సెక్రటరీ ఆఫ్రోజ్ ఖాన్, సహాయ కార్యదర్శి రాజయ్య, మైనింగ్ స్టాఫ్ నాయకులు బాలకష్ణ, రాములు, విజయ్ కుమార్, తిరుపతి, వెంకటేష్, వెంకటస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట గనులపై ధర్నా, వినతి



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట-1, 2 గనులపై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం 11వ వేజ్ బోర్డు 23 నెలల ఏరియర్స్ ఆగస్టు నెల జీతంతో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించి, గని మేనేజర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ కోల్ ఇండియాలో అగ్రిమెంట్ జరిగి ఇవ్వాలని సర్క్యులర్ జారీ చేసినప్పటికీ కోల్ ఇండియాలో ఆగస్టు నెలతో ఇస్తున్నారు. మన సింగరేణిలో ఇంతవరకు సర్క్యులర్ జారీ చేయకపోవడంలో అంతర్యమేంటన్నారు. తక్షణమే సర్క్యులర్ జారీ చేసి ఆగస్టు నెల జీతంతో 11వ వేజ్ బోర్డు ఏరియర్స్ తొందరగా చెల్లించాలన్నారు. అదేవిధంగా మన సింగరేణిలో కంపెనీకి వచ్చిన లాభాల్లో నుండి 35 శాతం వాటా ఆగస్టు నెల జీతంతో ఇవ్వాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ యాజమాన్యానికి వినతులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో కాసిపేట ఒకటవ గనిపై పిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కార్యదర్శి వి.రాజేందర్, షిఫ్ట్ ఇన్‌చార్జి చౌడ లింగయ్య, డి శ్రీనివాస్, రఘురాం, రత్నం కుమార్, ఆడెపు రవీందర్, సునీల్, కాసిపేట రెండవ గనిపై కార్యదర్శి గొల్ల శ్రీనివాస్ ఏరియా హాస్పిటల్ డీఆర్ శ్రీధర్, హిట్ సెక్రటరీ రత్నం ఐలయ్య పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌కు ఇద్దరు ఎంపిక

నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు అన్ని వర్గాల వారికి అవకాశం కల్పిస్తూ తలపెట్టిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి జిల్లా నుండి ఇద్దరు అభ్యర్థులు ఎంపికైనట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రంగాలలో ప్రజా ఉపయోగ పకర వినూత్న ఆవిష్కరణలు, నూతన పరికరాలు ఆవిష్కరించడం ద్వారా ప్రజలకు సులువైన మార్గాలలో పనులను సులభతరం చేయడంతో పాటు సౌకర్యాలు అందించేందుకు ఆవిష్కరణలు రూపొందించే ఇన్నోవేటర్‌ను గుర్తించి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి జిల్లా నుండి ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లాలోని మందమర్రి ప్రాంతానికి చెందిన కటకం వినయకుమార్ మోటారుతో నడిచే సైకిల్ ఆవిష్కరించారని, తాండూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండీ మక్బుద్ అత్యంత తక్కువ ఖర్చుతో ప్రొజెక్టర్ రూపొందించారని తెలిపారు. ఈ ఆవిష్కరణలను ఈ నెల 15వ తేదీన జిల్లాలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ప్రదర్శించి ఆవిష్కర్తలకు ప్రశంసా పత్రం అందించడం జరుగుతుందని తెలిపారు.

ఫోక్సో కేసులో నిందితునికి జీవిత ఖైదు

- రూ.80 వేల జరిమానా

నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఉమ్మడి మండలం కౌటాల పోలీస్‌స్టేషన్, ప్రస్తుత చింతలమానేపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామంలో 2016లో నమోదైన ఫోక్సో కేసులో నిందితుడు కొండు రాజేష్(26) అనే వ్యక్తికి, జీవిత ఖైదుతో పాటు రూ.80 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించి, ఎస్సై వెంకటేష్ కౌటల సీఐ సాదిక్ పాషా తలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బబాసాగర్ గ్రామంలో కోండు రాజేష్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన 17 ఏండ్ల గిరిజన బాలిక మీద లైంగిక వేధింపులకు పాల్పడగ బాధితురాలితో పాటు కుటుంబీకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి కౌటాల ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేశారు. అప్పటి కౌటాల సీఐ ఆచ్చేశ్వర్ రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ చక్రవర్తితో పాటు హబీబ్ ఖాన్, ప్రస్తుత డీఎస్పీ కరుణాకర్‌లు విచారణ చేపట్టారు. జిల్లా కోర్టు లో అడిషనల్ స్పెషల్ పీపీ జీవీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించగా, సాక్ష్యాలు నిరూపణ కావడంతో నిందితుడు రాజేష్ మీద నేరం రుజువు అయింది. ఈ మేరకు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ఎంవి. రమేష్‌కు జీవిత ఖైదు, రూ.90 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంభందించి కోర్టు డ్యూటీ పోలీస్ ఆఫీసర్‌గా బాబాజీ వ్యవహరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా విచారణ చేపట్టి సాక్షాలు ప్రవేశ పెట్టిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ సురేశ్ కుమార్ అభినందించారు.

కుల వివక్షపై కఠినంగా వ్యవహరించాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డీసీపీకి వినతి



నవతెలంగాణ-హాజీపూర్

కుల వివక్షపై కఠినంగా వ్యవహరించి ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో డీసీపీ రాంనాథ్ కేకేన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా పారిశ్రామిక జిల్లాగా ఉన్నప్పటికీ నేటికీ అనాగరిక పద్ధతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ లను గౌరవించే పద్ధతిలేదన్నారు. కనీసం మనుషులుగా చూసే స్థితి కన్పించడం లేదన్నారు. రోజు ఏదో ఒక్క చోట దళితులపై ఇతర కులాల్లో ఉన్న కుల దురహంకారులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లాలో అవమానకరమైన సంఘటనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. కొన్ని బయటి ప్రపంచానికి తెలుస్తున్న, మరికొన్ని భయంతో బయటకు రావడం లేదన్నారు. దళిత హక్కుల రక్షణ కోసం ఎన్ని చట్టాలు, జీఓలున్న ఉపయోగం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల గడిచినా కుల వివక్ష కొనసాగడం చోచనీయం అన్నారు.

'సమయపాలన ఎదుగుదలకు దోహదం చేస్తుంది'



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా సింగరేణిలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చేస్తుందని బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో బయోమెట్రిక్ విధానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటిస్తే వారి వ్యక్తిగత జీవితంలో ఎదుగుదలతో పాటు సంస్థ పురోగతికి దోహదపడుతుందన్నారు. చైర్మన్ శ్రీధర్ ఐఏఎస్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏరియాలో బయోమెట్రిక్ హాజర్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ప్రతి ఉద్యోగి సకాలంలో విధులకు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, ఏజీఎం(ఈఅండ్ఎం) తిరుమలరావు, డీజీఎం(సివిల్) సతీష్‌బాబు, డీజీఎం(ఎఫ్అండ్ఏ) రామారావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, ఐటీ మేనేజర్ నారాయణ, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు

చెరువులో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోనూర్ తంగళ్లపల్లికి చెందిన కొడిమల పోశం(32) చెరువులో పడి మృతి చెందినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. పోశం మద్యానికి అలవాటై మద్య తాగి ఎక్కడ పడితే అక్కడ పనికి పోయేవాడని, దీని కారణంగా అతని భార్య విడిచిపెట్టింది. సోమవారం ఉదయం ఇంటి నుంచి తాగడానికి వెళ్లాడు. పోశం కోసం అతని తల్లి, చిన్న తమ్ముడు వెతుకుతుండగా కోనూర్ శివారులోని చెరువు చెట్ల పొదల్లో దాగుకొనగా తల్లి చూసి వెళ్లేసరికి ప్రమాదవశాత్తు చెరువు కట్ట తూము వద్ద పడిపోయాడు. ఆమె కేకలు వేయడంతో గ్రామస్తులు చెరువులో దూకి పోశంను భయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి తల్లి బుచ్చక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ స్థలాల్లో రాత్రికి రాత్రే అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు బేషరతుగా కబ్జాకు పాల్పడుతున్నారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు పోచమ్మ గుడి దగ్గర 363 జాతీయ రహదారికి అనుకోని ఎలాంటి అనుమతులు లేకుండా కట్టడాలు చేపట్టారు. ఈ కట్టడాల నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో కొందరు నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి అక్రమ కట్టడాలను తొలగించాలని, కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌ను వివరణ కోరగా అక్రమ కట్టడాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అనుమతులు లేని కట్టడాలను తొలగిస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం



నవతెలంగాణ-జన్నారం

నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఆదివాసి డిపార్ట్‌మెంట్ జిల్లా ఉపాధ్యక్షులుగా అడాయి హనుమంతు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బోడ రవి నాయక్, అలాగే మండల ఉపాధ్యక్షులుగా కొడప ఆనంద్‌లను ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్, మండల మాజీ అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ పసివుల్లా, పట్టణ అధ్యక్షుడు దుమాల రమేష్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లి రీజియన్ సివిల్ క్వాలిటీ డీజీఎం పని చేసిన నాగేశ్వరరావు బదిలీపై ఆర్జీ-1 ఏరియా డీజీఎం సివిల్‌గా వెళ్తున్న సందర్భంగా సోమవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ బెల్లంపల్లి రీజియన్‌లో క్వాలిటీ డీజీఎంగా పనిచేసిన నాగేశ్వరరావు ఏరియా అభివృద్ధికి ఏరియాలో సివిల్ వర్క్స్‌లలో క్వాలిటీకి తనదైన ముద్ర వేశారని, వివిధ ఏరియాలలో వివిధ హోదాలలో పనిచేసి సంస్థ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించారని కొనియాడారు. బదిలీపై రామగుండం వెళుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్, సీఎంఓఏఐ నాయకులు అబ్దుల్ ఖాదర్, ఏవీ రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీవై సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, డీజీఎం పర్సనల్ అరవింద రావు, ఆర్కే-7 ఏజెంట్ రాముడు, సివిల్ డీజీఎంలు శివ రావు, ఆనంద్ కుమార్, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్టేట్స్ ఆఫీసర్ శ్రీమతి వరలక్ష్మి పాల్గొన్నారు.

గోలేటి గ్రామంలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామంలో తీజ్ ఉత్సవాలను ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆజ్మీర ఆత్మారాం నాయక్ పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలోని బంజారాల అతి ముఖ్యమైన పండుగలలో తీజ్ పండుగ ఒకటన్నారు. దీనిని ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తీజ్ పండుగకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు. బంజార ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్, రామారాజ్ మహారాజ్ సేవలకు ప్రతీకగా తీజ్ పండుగ సంవత్సరానికి ఒకసారి సాంప్రదాయకంగా మహిళలు ఘనంగా జరుపుకుంటారన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న వేడుకలలో ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు బాల్క సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ నెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాల పంపిణీ, 1.30 గంటల నుండి 1.45 వరకు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్ళను సందర్శించి, వివిధ పథకాలలో ఎంపికైన లబ్ధిదారులకు పథకం ఫలాలు అందించడం జరుగుతుందని తెలిపారు.